ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి





ఇంచర్ల సభలో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు

- తల తాకట్టు పెట్టైనా సంక్షేమ ఫలాల అమలు
- అర్హులందరికీ దశల వారీగా ఇళ్లు
- ములుగు జిల్లాకు మరో వెయ్యి ఇళ్లు మంజూరు
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- ములుగు జిల్లాను పర్యాటక ఖిల్లాగా మారుస్తాం: మంత్రి సీతక్క

ములుగు రూరల్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రతి పేదవాడికి ఇల్లు నిర్మించి ఇవ్వడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. తల తాకట్టు పెట్టైనా సంక్షేమ ఫలాలను అమలు చేయడం జరుగుతుందని, అర్హులందరికీ దశల వారీగా ఇళ్లు మంజూరు చేస్తామని చెప్పారు. ములుగు మండలం ఇంచర్ల గ్రామంలోని ఇందిరమ్మ కాలనీలో బుధవారం ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ, నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసి 23మంది లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా గ్రామంలోని ఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో మంత్రి పొంగులేటి మాట్లాడారు.

ప్రజా ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా రూ.22,500 కోట్లతో 4.5లక్షల ఇందిరమ్మ ఇళ్లను నిర్మించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతోందని అన్నారు. గతంలో సైతం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు పూర్తిచేసిందని తెలిపారు. గత పదేళ్లుగా డబుల్‌బెడ్‌రూం ఇళ్లు నిర్మించి ఇస్తామని పేదలకు సాకులు చెప్పిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం కేవలం 93వేల ఇళ్లకు టెండర్లు పిలిచి 60వేల ఇళ్లను మాత్రమే పూర్తి చేసిందని అన్నారు. రాష్ట్రంలోని ఇందిరమ్మ ప్రభుత్వం సంవత్సర కాలంలోనే 4.5లక్షల ఇళ్లను నిర్మించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతుందని, ఇందులో ములుగు నియోజకవర్గానికి 3వేల ఇళ్లు మంజూరు కాగా, ఐటీడీఏకు మరో 1,500 ఇళ్లు మంజూరు అయ్యాయని పేర్కొన్నారు. తాను మరో 1000 ఇళ్లను మంజూరు చేస్తున్నానని హామీ ఇచ్చారు.

మంత్రి సీతక్క మాట్లాడుతూ మాజీ సీఎం కేసీఆర్ డబుల్‌బెడ్‌రూం ఇళ్లు అందిస్తామని ప్రజలను మోసం చేశారని అన్నారు. నేడు ఇందిరమ్మ ప్రభుత్వం ఇళ్ల నిర్మాణ పనులను చేపట్టడంతో దానిని చూసి ఓర్వలేక ప్రతిపక్ష నాయకులు దుష్ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రతి పేదవాడికి నీడను అందించడంతోపాటు కడుపు నిండా తిండి తినడానికి సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టడం జరుగుతుందని అన్నారు. జిల్లాను పూర్తిస్థాయిలో పర్యాటక ప్రాంతంగా మార్చడానికి నిధులు కేటాయించడం జరిగిందని, రూ.70కోట్లతో రామప్పలో పనులు చేపట్టడమే కాకుండా రూ.30కోట్లతో ఐలాండ్ అభివృద్ధి పనులు చేయడం జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు సీహెచ్.మహేందర్‌జీ, సంపత్‌రావు, ఆర్డీవో వెంకటేష్, ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. అంతకుముందు హెలికాప్టర్ ద్వారా ములుగు చేరుకున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పంచాయతీరాజ్ శాఖమంత్రి ధనసరి అనసూయసీతక్క, మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాంనాయక్ స్వాగతం పలికారు.

బడిగంట మోగే వేళ..

నేటి నుంచి బడులు షురూ



మహబూబాబాద్ వేల్పులసత్యం నగర్ ప్రాథమిక పాఠశాలలో పారిశుధ్య పనులు చేస్తున్న సిబ్బంది



ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో విద్యార్థినుల యూనిఫాంను ఉపాధ్యాయులకు అందిస్తున్న

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : వేసవి సెలవులు బుధవారంతో ముగిశాయి.. గురువారం నుంచి విద్యాసంస్థలు పునఃప్రారంభం కానున్నాయి. సమ్మర్ అంతా అమ్మమ్మ, నానమ్మ, తాతయ్య, బంధువుల ఇళ్లలో గడిపిన పిల్లలు.. నేటి నుంచి బడిబాట పట్టనున్నారు. ఆటపాటలకు టాటా చెప్పి, పాఠశాలలకు పరుగు తీయనున్నారు.

మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు అన్ని యాజమాన్యాల పాఠశాలలు ఈనెల 12వ తేదీ నుంచి ప్రారంభించేందుకు సర్వం సిద్ధం చేశారు. ప్రభుత్వం ఏప్రిల్ 25వ తేదీ నుంచి జూన్ 11 వరకు వేసవి సెలవులు ప్రకటించింది. జిల్లాలోని అన్ని గ్రామాల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఈ నెల 6 నుంచి ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట నిర్వహిస్తున్న ప్రధానోపాధ్యాయులు, ప్రత్యేకాధికారులు, ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు ఈ నెల 12 నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో బుధవారం పాఠశాల ప్రాంగణాలు, తరగతి గదుల పరిశుభ్రత, మరుగుదొడ్లు, తాగునీరు మొదలగు పనులు పూర్తి చేశారు. జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల ప్రత్యేకాధికారులు పలు పాఠశాలలను సందర్శించి పారిశుధ్యపనులను పర్యవేక్షించి, పాఠశాలల ప్రారంభానికి సర్వం సిద్ధం చేయించారు. కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్, అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్‌టొప్పో పలు పాఠశాలలు సందర్శించి మౌళిక వసతులపై ఆరా తీశారు.



కురవి ప్రాథమిక పాఠశాలలో పారిశుధ్య పనుల ఏర్పాట్లను పరిశీలిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పొ

- పునఃప్రారంభానికి పాఠశాలలు సిద్ధం
- అన్ని ఏర్పాట్లు చేసిన ప్రధానోపాధ్యాయులు
- స్కూళ్లను సందర్శించిన కలెక్టర్, అదనపు కలెక్టర్, అధికారులు
- జిల్లాలో 1,180 పాఠశాలల్లో పారిశుధ్య పనులు పూర్తి
- తొలిరోజే పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, నోట్ పుస్తకాలు పంపిణీకి ఏర్పాట్లు

జిల్లాలో 1,180 పాఠశాలలు...

జిల్లాలోని 18 మండలాల పరిధిలో అన్ని యాజమాన్యల పాఠశాలలు 1180 ఉన్నాయి. వాటిల్లో 1వ తరగతి నుంచి 10 వరకు తెలుగు, ఇంగ్లీష్, ఉర్దూ మీడియంలలో 96,408 మంది విద్యనభ్యసిస్తున్నారు. ఇందులో ప్రాథమిక పాఠశాలలు-829 ఉండగా బాలురు-11,262, బాలికలు-11,143 మంది మొత్తం 22,405 మంది విద్యనభ్యసిస్తున్నారు. ప్రాథమికోన్నత పాఠశాలలు-159 ఉండగా బాలురు-7,569, బాలికలు-9630 మొత్తం 17,199, ఉన్నత పాఠశాలలు-192 ఉండగా బాలురు-30,242, బాలికలు-26,562 మొత్తం 56,804 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు.

ప్రారంభం రోజునే పుస్తకాలు, యూనిఫాం పంపిణీ..

జిల్లా వ్యాప్తంగా విద్యాసంవత్సరం ప్రారంభం రోజునే 1వ తరగతి నుంచి 10వ తరగతి చదువుతున్న ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నూతన పాఠ్యపుస్తకాలు, యూనిఫాం అందించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు నోట్ పుస్తకాలు అందించనున్నారు. మొత్తంగా గురువారం నుంచి విద్యాసంస్థలు పునఃప్రారంభం కానుండటంతో సందడి నెలకొననుంది.

విద్యాసంస్థలను పునఃప్రారంభానికి సిద్ధంగా ఉంచాలి

- తరగతి గదులను శుభ్రంగా ఉంచాలి
- కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్

8



మహబూబాబాద్ జిల్లా ఆస్పత్రిలో జనరల్ వార్డులో చికిత్స పొందుతున్న జ్వర బాధితులు

ముంచుకొస్తున్న సీజనల్ ముప్పు

- జిల్లా ఆస్పత్రికి పెరుగుతున్న జ్వర బాధితులు
- అరకొర వసతులతో రోగులకు తప్పని ఇబ్బందులు
- వెంటనే ఇస్తున్న మందులు, రక్తపరీక్ష కిట్ల కొరత
- ముందుగా ఆరంభమైన వర్షాలతో పారిశుధ్యం అస్తవ్యస్థం
- ముందస్తు చర్యలతో సీజనల్ వ్యాధుల కట్టడి సాధ్యం

8

బ్యాంక్ అధికారులు పారదర్శకంగా పని చేయాలి

జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్‌నాయక్

గూడూరు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : బ్యాంక్ అధికారులు, సిబ్బంది పారదర్శకంగా పని చేయాలని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోతు హుస్సేన్‌నాయక్ అన్నారు. గూడూరు యూనియన్ బ్యాంక్ అధికారులతో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గూడూరు ఏజెన్సీ ప్రాంతంలో యూనియన్ బ్యాంక్ అనేక సేవలందిస్తుందన్నారు. కస్టమర్లకు ఇబ్బందులు కలుగకుండా పని చేయాలన్నారు. బ్యాంకులో ఖాతాదారులు ఎక్కువగా ఉన్నారని, సంఖ్యకనుగుణంగా సిబ్బందిని నియమించేందుకు కృషి చేస్తానన్నారు. ఖాతాదారుల పట్ల బ్యాంక్ నిర్లక్ష్యధోరణి వీడాలన్నారు. రైతులకు సకాలంలో వ్యవసాయ రుణాలను మంజూరు చేయాలన్నారు. చిరువ్యాపారులకు ముద్ర రుణాలను ఇచ్చే ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ మేనేజర్ జె.రవికుమార్, మాజీ ఎంపీపీ చెల్పూరి వెంకన్న, గిరిజన మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాంబాబు, మంతాపురం నర్సయ్య, రాసమల్ల వెంకన్న, నాగరాజు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జాటోతు హుస్సేన్‌నాయక్

నేడు రామప్పకు పీసీ గోష్



హనుమకొండ టౌన్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు రిటైర్డ్ జడ్జి, కాళేశ్వరం ప్రాజెక్టు ఎంక్వైరీ కమిషన్ చైర్మన్ పీసీ గోష్ గురువారం రామప్ప పర్యటనకు వెళ్లనున్నట్లు సంబంధిత అధికారులు బుధవారం తెలిపారు. ఢిల్లీ నుంచి హైదరాబాద్ తాజ్ కృష్ణ హోటల్ నుంచి బయల్దేరి హనుమకొండలోని హరిత కాకతీయ హోటల్‌కు బుధవారం సాయంత్రం చేరుకున్నారు. గురువారం ఉదయం 9.30గంటలకు హరిత కాకతీయ హోటల్ నుంచి రోడ్డు మార్గం ద్వారా రామప్పకు ఉదయం 10.40గంటలకు చేరుకొని దర్శనం చేసుకొని మధ్యాహ్నం 1.30గంటలకు హరిత కాకతీయ హోటల్‌కు చేరుకుంటారని, హైదరాబాద్‌కు సాయంత్రం 3గంటలకు బయల్దేరి రాత్రి 7గంటలకు హోటల్ తాజ్‌కృష్ణ చేరుకోనున్నట్లు అధికారులు తెలిపారు.

మోదీ పాలనలో ప్రజాస్వామ్యానికి తూట్లు

గార్ల, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని ప్రధాని నరేంద్రమోదీ ప్రభుత్వం ఏర్పడి 11 సంవత్సరాల పాలనలో దేశంలోని ప్రజాస్వామ్యానికి, హక్కులు తూట్లు పొడిచే విధంగా ఉందని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళపల్లి శ్రీనివాసరావు విమర్శించారు. బుధవారం కొత్తతండాలో నిర్వహించిన సీపీఐ మండల 3వ మహాసభలో పాల్గొని మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వ పాలనలో దేశంలో వ్యవస్థలన్నీ నిర్వీర్యమవుతున్నాయని చెప్పారు. ఈ మహాసభలో సీపీఐ జిల్లా కార్యదర్శి బి.వి జయసారథి, రాష్ట్ర కమిటీ సభ్యులు కట్టెబోయిన శ్రీనివాస్, జంపాల వెంకన్న, కట్టెబోయిన బిక్షమయ్య, వీరన్న, భట్టు వీరన్న, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

చెరువులకు గండం

10 నెలలైనా ముందుకు సాగని మరమ్మతు పనులు

- సీఎం వచ్చిపోయినా, పూర్తి కానీ నిర్మాణాలు
- ఖరీఫ్‌కు కష్టం.. రైతులకు సాగు ఇబ్బంది

మహబూబాబాద్ అగ్రికల్చర్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : ప్రకృతి.. వికృత రూపం దాల్చింది.. భారీ వర్షాలు కురిసి వరదలు పొంగిపొర్లి చెరువులు, వాగులు, వంతెనలు, రోడ్లు తెగిపోయాయి. మహబూబాబాద్ జిల్లాలోని కేసముద్రం, తాళ్లపూసపల్లి చోట్ల రైల్వేట్రాక్ కింద మొత్తం కొట్టుకుపోయింది. జన జీవనం స్తంభించిపోయి కోట్లాది రూపాయలు నష్టం వాటిల్లింది. దాదాపు 10 నెలలు గడిచిపోయినా అత్యవసరమైన పెద్దచెరువుల మరమ్మతులు చేపట్టలేదు. చిన్నవాటికి మాత్రమే పనులు చేశారు.


గత సెప్టెంబర్ 2న మహబూబాబాద్ జిల్లాకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వచ్చి పలుచోట్ల వరదలతో నష్టపోయిన రైతులను పరామర్శించారు. పరిస్థితిని సమీక్షించి, అధికారులతో చర్చలు జరిపి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. అయినప్పటికి నీటిపారుదలశాఖ అధికారులు చిన్నపాటి చెరువులు, కుంటల్లో మరమ్మతులు చేపట్టారే తప్ప పెద్దచెరువులు, చెక్‌డ్యాంల నిర్మాణాలు చేపట్టకపోవడంతో వర్షాలకు పెద్ద చెరువులు నిండే పరిస్థితి కన్పించడం లేదు. చెక్ డ్యాంలలో నీరు ఉండే పరిస్థితి కన్పించకపోవడంతో తెగిన చెరువుల కింద ఆయకట్టు ప్రాంతాల్లో పంటలు పండే పరిస్థితి కనబడడం లేదు. ఖరీఫ్‌కు కష్టకాలంగా మారింది. ఆ ప్రాంతాలు బీడుభూములుగా మారే ప్రమాదం ఏర్పడింది. మహబూబాబాద్ జిల్లాలో కొన్నినెలల క్రితం కురిసిన వానలకు 134చెరువులు తెగిపోగా, అందులో 119 చెరువు కట్టల నిర్మాణాలను పూర్తి చేశారు. ఇంకా 13 చెరువు కట్ట పనులు ప్రతిపాదనలు, టెండర్ల దశలో ఉన్నట్లు నీటిపారుదల శాఖ అధికారులు చెబుతున్నారు.

తెగిన చెరువులు ఇలా..

జిల్లాలో ప్రధానంగా చెరువులు, చెక్‌డ్యాంల నిర్మాణాలు కొన్ని పెండింగ్‌లో పడ్డాయి. ముఖ్యంగా నెల్లికుదురు మండలంలోని రాజులకొత్తపల్లి, రావిరాల, ఆలేరు చెరువులు తెగిపోయాయి. అందులో ఆలేరు చెరువు కట్ట నెలరోజుల క్రితం పనులు చేపట్టగా రాజులకొత్తపల్లి, రావిరాల పనులు టెండర్ల దశలో ఉన్నాయి. రాజులకొత్తపల్లి చెరువు కట్టకు దాదాపు ఐదుచోట్ల భారీ గండ్లుపడ్డాయి. ఒక చుక్క వర్షపునీరు ఉండే (మిగతా 8వ పేజీలో)



నీరులేక బోసిపోతున్న రాజులకొత్తపల్లి చెరువు (ఫైల్)



చిన్నగూడూరు మండలంలోని ఆకేరువాగుపై తెగిన చెక్‌డ్యాం (ఫైల్)



తెగిపోయిన ఆకేరువాగు ఆనకట్ట కుడి కాలువ(ఫైల్)

చెరువులకు మరమ్మతులు చేపట్టండి

చీనూరు మధుకర్ రైతు, రాజులకొత్తపల్లి, నెల్లికుదురు



రాజులకొత్తపల్లిలో చెరువు ఐదుచోట్ల భారీగా గండ్లు పడ్డాయి. 800 ఎకరాల్లో దాని ఆయకట్టు ఉండగా అధికారులు వచ్చి కట్టను చూసి పోతున్నారే తప్ప చెరువుల మరమ్మతులకు పనులు చేపట్టడం లేదు. ఖరీఫ్‌లో ఆ చెరువు కింద రైతులు పంటలు సాగు చేసే పరిస్థితి లేదు. వారి పరిస్థితి ఆగమ్యగోచరంగా తయారైంది. వెంటనే చెరువు కట్ట మరమ్మతు పనులు చేపట్టడమే కాకుండా జిల్లాలో పెండింగ్‌లో ఉన్న చెరువులు, చెక్‌డ్యాంల పనులు పూర్తి చేయాలి.



నారాయణపురం రెవెన్యూ సదస్సు వద్ద డిమాండ్ చేస్తున్న రైతులు

రెవెన్యూ సదస్సు వద్ద రైతుల ధర్నా

- ఎంజాయ్‌మెంట్ సర్వే ప్రకారమే పట్టాలివ్వాలని డిమాండ్

కేసముద్రం, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : నారాయణపురంలో బుధవారం భూ భారతి చట్టంలో భాగంగా నిర్వహించిన రెవెన్యూ సదస్సు వద్ద రైతులు ధర్నా చేశారు. ఆ గ్రామ రైతులు ఫ్లెక్సీతో అక్కడికి ప్రదర్శనగా వచ్చి ఎంజాయ్‌మెంట్ సర్వే ప్రకారమే పట్టాలివ్వాలని డిమాండ్‌తో నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆ గ్రామానికి చెందిన మిర్యాల నర్సింహరెడ్డి, చెన్నూరి అమరేందర్‌రెడ్డి, ఊకంటి సారంగరెడ్డి, మాజీ ఎంపీటీసీ రవితో పాటు మరికొంతమంది రైతుల సంతకాలతో రెవెన్యూ సదస్సులో వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2017 భూప్రక్షాళనలో గ్రామంలోని 1827 ఎకరాల భూమిని అటవీశాఖకు చెందినదిగా పేర్కొంటూ సుమారు వెయ్యి మంది రైతులకు చెందిన పట్టాదారు పాస్‌పుస్తకాలను రద్దు చేశారని తెలిపారు. గ్రామంలో 43 సర్వే నెంబర్లలో 1827 ఎకరాలను రెవెన్యూ భూమిగా గుర్తించారని తెలిపారు. అనంతరం ఏడేళ్లుగా పలుమార్లు ధర్నాలు, సచివాలయం ముట్టడి నేపథ్యంలో రైతులందరికీ పట్టాలిచ్చేందుకు ఈ ఏడాది ఏప్రిల్, మే నెలల్లో రెవెన్యూ అధికారులు ఎంజాయ్‌మెంట్ సర్వేను పూర్తిస్థాయిలో నిర్వహించారని చెప్పారు. ఈ సర్వేలోని వివరాల ప్రకారమే తమకు పట్టాదారు పాస్‌పుస్తకాలివ్వాలని డిమాండ్ చేశారు. ఈ సదస్సులో డీటీ ఎర్రయ్య, ఆర్‌ఐ ఎంఏ.మజీద్, ఏఎస్‌వో ఎన్.వేణు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటర్ లింకింగ్ లైన్ల పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలి

టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి

రాంనగర్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): పురోగతిలో ఉన్న ఇంటర్ లింకింగ్ లైన్ల పనులను యుద్ధ ప్రతిపాదికన పూర్తి చేయాలని టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి అధికారులకు సూచించారు. బుధవారం హనుమకొండ కార్పొరేట్ కార్యాలయంలో సీఈలు నోడల్ జీఎంలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వరుణ్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎన్పీడీసీఎల్ పరిధిలోని 16 సర్కిళ్లలో వంద శాతం రెవెన్యూ కలెక్షన్లు తీసుకురావాలని, కేబుల్ ఆపరేటర్లు విద్యుత్ పోల్స్‌పైన చిందర వందరంగా వైర్లు పెట్టకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పోల్‌రెంటల్ గ్రామాల్లో రూ.15, అర్బన్‌లో రూ.20 వసూలు చేయాలని సూచించారు. కాలిపోయిన, పని చేయని విద్యుత్ మీటర్లను తొలగించి కొత్త మీటర్లను అమర్చాలన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల ఫెయిల్యూర్లను తగ్గించి డిపార్ట్‌మెంట్ షెడ్‌ల్లోనే ట్రాన్స్‌ఫార్మర్లను రిపేర్ చేయాలన్నారు. లైన్ క్లియరెన్స్ ఎల్‌సీ యాప్ ద్వారానే చేయాలన్నారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జి డైరెక్టర్ బి.అశోక్ కుమార్, పి.సదర్‌లాల్, వి.తిరుపతిరెడ్డి, సీఈలు కె.తిరుమల్‌రావు, రాజ్‌చౌహాన్, అశోక్, వెంకటరమణ, జీఎంలు వేణుబాబు, కృష్ణమోహన్, వెంకటకృష్ణ, శ్రీనివాస్, సత్యనారాయణ, సురేందర్, ఉత్తమ్ తదితరులు పాల్గొన్నారు.



సమీక్షలో మాట్లాడుతున్న సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి

డైట్, బీఈడీ కళాశాలల్లో గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): హనుమకొండలోని ప్రభుత్వ డైట్, బీఈడీ కళాశాలల్లో వివిధ విభాగాల్లో గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టుల భర్తీ కోసం అర్హత, ఆసక్తిగల అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా డైట్, బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ అబ్దుల్‌హై బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 65 సంవత్సరాలలోపు వయస్సు కలిగి, నిరుద్యోగ, రిటైర్డ్ అధ్యాపకులు దరఖాస్తులు చేసుకునేందుకు అర్హులని ఆయన తెలిపారు. ఎంపికైన కరిక్యులర్ అభ్యర్థులకు నెలకు రూ.23,400, కోకరిక్యులర్ అభ్యర్థులకు నెలకు రూ.15,600 గౌరవ వేతనం అందజేస్తారని పేర్కొన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు సంబంధిత దరఖాస్తు ఫారాలను 13 నుంచి 19 వరకు ఆయా కళాశాలల్లో సమర్పించాలని సూచించారు. 21న తుది జాబితాను ప్రకటించి 24 నుంచి 26 వరకు మెరిట్ ప్రాతిపదికన 1:5 నిష్పత్తిలో డెమో, ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఎంపికైన అభ్యర్థుల జాబితాను 28న ప్రకటిస్తామని, వారు జూలై 1నుంచి కళాశాలకు హాజరు కావాల్సి ఉంటుందని ఆయన పేర్కొన్నారు. పోస్టులు, వాటికి సంబంధిత ఖాళీలకు ఆయా కళాశాలల్లో సంప్రదించాలని ఆయన కోరారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

పెద్దవంగర, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని అవుతాపురం గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, ఎస్సై క్రాంతికిరణ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని అవుతాపురం గ్రామానికి చెందిన కోట భిక్షం(68)-ముత్తమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. పెద్ద కుమారుడు కోట శ్రీను-శోభ దంపతులకు కుమార్తె శిరీష జన్మించిన తర్వాత కొద్ది రోజులకు శ్రీను మృతి చెందాడు. శోభ మరో వ్యక్తిని వివాహం చేసుకోగా శిరీష వారి అమ్మమ్మ ఇంటి వద్ద పెరిగింది. చిన్న కుమారుడు కోట అశోక్-రమ దంపతులతో కలిసి కోట భిక్షం-ముత్తమ్మ దంపతులు ఉంటున్నారు. కోట భిక్షం పేర సుమారు 5ఎకరాలు ఉండగా, పెద్ద కుమారుడైన శ్రీను కుమార్తె శిరీష పేరు మీద ముప్పై గుంటల భూమిని ఇటీవల పెద్దమనుషల సమక్షంలో రిజిస్ట్రేషన్ చేయించారు. ఆ భూమిని శిరీష సాగుచేసుకునే క్రమంలో తరచూ గొడవలు జరుగుతున్నాయి. మంగళవారం రాత్రి చిన్న కోడలు కోట రమ అత్తమామలతో గొడవలు పడి వారిని కొట్టింది. బుధవారం రోజున కోట భిక్షం అనుమానాస్పద స్థితిలో మృతి చెంది ఉన్నాడు. తండ్రి మరణ విషయం తెలుసుకున్న వల్లపు రేణుక తమ్ముడు కోట అశోక్-రమ దంపతులను నిలదీయడంతో కాసేపు వాగ్వాదం జరిగింది. తన తండ్రి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడని వల్లపు రేణుక ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పూర్తి స్థాయిలో దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.


మృతి చెందిన కోట భిక్షం

గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణ పనులు షురూ

- అడ్డుకున్న రైతులు.. అధికారులతో వాగ్వాదం
- బహిరంగ మార్కెట్ ధర చెల్లించాలని డిమాండ్
- అధికారులు సర్దిచెప్పడంతో సద్దుమణిగిన వివాదం


హైవే నిర్మాణ పనులను అడ్డుకున్న భూ బాధిత రైతులు

దామెర, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ జిల్లా దామెర మండలం పసరుగొండ క్రాస్ రోడ్‌లో చేపట్టిన గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే రోడ్డు నిర్మాణ పనులను బుధవారం రైతులు అడ్డుకున్నారు. పోలీసు బలగాల పహారాలో రెవెన్యూ, నేషనల్ హైవే అథారిటీ అధికారులు రోడ్డు నిర్మాణ పనులను చేపట్టడంతో బాధిత రైతులు బొల్లు రాజిరెడ్డి, సమ్మిరెడ్డి, తిరుపతిరెడ్డి, సమ్మిరెడ్డిలు స్వయంగా అడ్డుకున్నారు. తమకు బహిరంగ మార్కెట్ ధర చెల్లిస్తేనే వ్యవసాయ భూములను ఇస్తామని తెగేసి చెప్పారు. దీంతో పోలీసు ఉన్నతాధికారులు, బలగాల పహారాలో నేషనల్ హైవే అథారిటీ అధికారులు నిర్మాణ పనులను ప్రారంభించారు. అక్కడే వేచి ఉన్న బాధిత రైతులు వచ్చి ఎక్స్‌కవేటర్ సహాయంతో చేపట్టిన పనులను అడ్డుకున్నారు. తమ భూములకు సంబంధించిన విషయమై కోర్టులో కేసు నడుస్తోందని, తమ భూములను బలవంతంగా లాక్కుంటారా..? అంటూ అధికారులను, పోలీసులను నిలదీశారు. ప్రస్తుత బహిరంగ మార్కెట్ ధర ఎకరానికి రూ.4 కోట్లు చెల్లించాల్సిందేనని తెగేసి చెప్పారు. అలా కాకుండా ఎకరానికి రూ. 80 లక్షలు చెల్లిచస్తామంటే ఊరుకోమని చెప్పారు. గతంలో ప్రభుత్వానికి అప్పటి జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు తమ భూములకు ఎకరానికి రూ.3కోట్లు నుంచి రూ.4కోట్లు ధర పలుకుతోందని నివేదిక పంపారని, ఆ నివేదికను ఆధారంగా చేసుకుని తమకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. మూడు పంటలు పండించుకునే పంట పొలాల నుంచి తమ అనుమతి లేకుండా బలవంతంగా రోడ్డు నిర్మాణ పనులను జరపడమేమిటని రైతులు ప్రశ్నించారు. పనులు చేస్తున్న ఎక్స్‌కవేటర్‌కు అడ్డుగా నిలిచారు.

దీంతో బాధిత రైతులకు పోలీ సు, రెవెన్యూ అధికారుల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. కాగా, రెవెన్యూ, పోలీసు అధికారులు కలుగచేసుకుని నచ్చచెప్పడంతో రైతులు ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో పరకాల ఆర్డీవో కె.నారాయణ, తహసీల్దార్ ఎం.జ్యోతివరలక్ష్మీదేవి, పరకాల రూరల్ సీఐ పి.రంజిత్‌రావు, దామెర ఎస్సై కొంక అశోక్, ఆర్‌ఐ ఎల్.భాస్కర్‌రెడ్డి, ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.


పనులు చేస్తున్న ఎక్స్‌కవేటర్

రైలు ఢీ ఒకరి మృతి

నెక్కొండ, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): నెక్కొండ రైల్వే స్టేషన్ సమీపంలోని ఫ్లైఓవర్ వద్ద బుధవారం సాయంత్రం హైదరాబాద్ వెళ్తున్న ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొని పేరబోయిన నాగరాజు (35) మృతి చెందినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. మృతుడి వద్ద లభించిన ఆధార్ కార్డులో మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం గుర్తూరుకు చెందిన పేరబోయిన నాగరాజు అని వివరాలు ఉన్నాయని హెడ్ కానిస్టేబుల్ తెలిపారు. ప్రమాదానికి గల పూర్తికారణాలు తెలియాల్సి ఉందన్నారు. పంచనామా జరిపి మృతదేహాన్ని ఎంజీఎం మార్చురీకి తరలించామన్నారు.


మృతుడు పేరబోయిన నాగరాజు

నేటి నుంచి జేఎన్ఎస్‌లో విద్యుత్ ఉద్యోగుల క్రీడలు

రాంనగర్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): మూడు రోజులు పాటు తెలంగాణ ట్రాన్స్‌కో అండ్ డిస్కంల ఇంటర్ సర్కిల్ కబడ్డీ, బాల్‌బ్యాడ్మింటన్ టోర్నమెంట్స్ హనుమకొండ జేఎన్ఎస్ స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు టీజీ ఎన్పీడీసీఎల్ స్పోర్ట్స్ కౌన్సిల్ అధ్యక్షుడు, హనుమకొండ సర్కిల్ సూపరింటెండెంట్ పి.మధుసూదన్‌రావు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి హాజరై క్రీడలను ప్రారంభించనున్నట్లు ఆయన తెలిపారు. కబడ్డీ, బాల్ బ్యాడ్మింటన్ క్రీడలకు రాష్ట్రంలోని ట్రాన్స్ కో, డిస్కంల నుంచి సుమారు 20 టీంలు పాల్గొంటున్నట్లు స్పోర్ట్స్ కౌన్సిల్ నిర్వాహకులు తెలిపారు.

రేపటి నుంచి జాతీయ స్థాయి నాటక పోటీలు

వరంగల్ కల్చరల్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): వరంగల్ పోతన విజ్ఞాన పీఠంలో ఈ నెల 13 నుంచి 15 వరకు జాతీయ స్థాయి నాటక పోటీలు ప్రదర్శిస్తున్నట్లు రంగస్థల కళాకారుల ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడు కాజీపేట తిరుమలయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ, ఐక్య వేదిక పరపతి సంఘం సభ్యుల సహకారంతో వరంగల్ జిల్లా రంగస్థల కళాకారుల ఐక్య వేదిక ఆధ్వర్యంలో 16వ వార్షికోత్సవం సందర్భంగా మూడు రోజుల పాటు ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సమకాలీన అంశాలను ప్రతిబింబించే ఇతివృత్తంతో ఈనాటకాలు కొనసాగుతాయని, నాటక అభిమానులు, కవులు, కళాకారులు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరై నాటకాలను వీక్షించాలని కోరారు. జాతీయ స్థాయి నాటక పోటీలకు అఖిల భారత పద్మశాలీ సంఘం మాజీ అధ్యక్షుడు ఈగ మల్లేశం రాజపోషకులుగా వ్యవహరిస్తారని తెలిపారు.

పోలీస్ కస్టడీ నుంచి దొంగ పరార్

● ఎంజీఎం ఆస్పత్రిలో ఘటన ● వెతుకుతున్న కాజీపేట, మట్టెవాడ పోలీసులు

మట్టెవాడ జూన్ 11, (ఆంధ్రజ్యోతి): పోలీసుల కళ్లు గప్పి కస్టడీలో ఉన్న దొంగ పరారయ్యాడు. మట్టెవాడ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కాజీపేట మండలం కడిపికొండ ప్రాంతానికి చెందిన కట్కూరి సాయికుమార్‌ను దొంగతనం కేసులో కాజీపేట పోలీసులు అరెస్టు చేశారు. అతడిని రిమాండ్‌కు తరలించే క్రమంలో వైద్య పరీక్షల నిమిత్తం బుధవారం ఎంజీఎం ఆస్పత్రికి తీసుకువచ్చారు. ఈ క్రమంలో ఎస్కార్ట్ పోలీసుల కళ్లుగప్పి పారిపోయాడు. దీంతో కాజీపేట పోలీసులు బుధవారం రాత్రి మట్టెవాడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నిందితుడి కోసం మట్టెవాడ, కాజీపేట పోలీసులు ముమ్మరంగా గాలిస్తున్నారు. నగరంలో సీసీ పుటేజీలను పరిశీలిస్తున్నారు.

నలుగురు తహసీల్దార్ల బదిలీ

వరంగల్ కలెక్టరేట్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నలుగురు తహసీల్దార్‌లను బదిలీ చేస్తూ కలెక్టర్ సత్యశారద బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. కలెక్టరేట్ సూపరింటెండెంట్‌గా పని చేస్తున్న ఎన్.రమేశ్‌ను ఖానాపూర్ తహసీల్దార్‌గా బదిలీ చేశారు. చెన్నారావుపేట తహసీల్దార్ పిఎస్.ఫణికుమార్‌ను ఆర్డీవో కార్యాలయ ఏవోగా, ఆర్డీవో కార్యాలయ ఏవోగా పని చేస్తున్న మహ్మద్ అబీద్ అలీని చెన్నారావుపేట తహసీల్దార్‌గా, నర్సంపేట నాయబ్ తహసీల్దార్ ఎ.రాజేశ్వర్‌రావును దుగ్గొండి (ఎఫ్ఏసీ) తహసీల్దార్‌గా బదిలీ చేసినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.


రాంచంద్రునాయక్‌ను సన్మానిస్తున్న జబర్దస్త్ నటుడు జీవన్

ప్రభుత్వ విప్‌ను కలిసిన నటుడు జీవన్

చిన్నగూడూరు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే రాంచంద్రునాయక్‌ను బుధవారం చిన్నగూడూరు మండలం గుండంరాజుపల్లి గ్రామానికి చెందిన జబర్దస్త్ నటుడు జీవన్, ఎస్‌జే ప్రొడక్షన్ హౌజ్ మూవీ టీం సభ్యులు హైదరాబాద్ మినిస్టర్ క్వార్టర్స్‌లో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి, మొక్కను అందించారు. డిప్యూటీ స్పీకర్‌గా ప్రకటించిన సందర్భంగా ఎస్‌జె మూవీ టీం సభ్యులు రాంచంద్రునాయక్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కష్టపడ్డ సాంగ్ ఫేమ్ షాను షేక్ తదితరులు ఉన్నారు.

కొప్పూర్‌లో అనుమతి లేని మందుల విక్రయాలు

భీమదేవరపల్లి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొప్పూర్ గ్రామంలో అనుమతి లేకుండా ఆర్‌ఎంపీ వైద్యుడు విలాసాగరం శ్రీనివాస్ మందులు విక్రయిస్తున్నట్లు హనుమకొండ, వరంగల్ జిల్లాల డ్రగ్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. కొప్పూర్‌లో విలాసాగరం శ్రీనివాస్ అనే ఆర్‌ఎంపీ వైద్యుడు అనుమతులు లేకుండా మందులు విక్రయిస్తున్నాడని ఫిర్యాదు అందింది. ఈ మేరకు డ్రగ్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి దాడులు నిర్వహించామన్నారు. ఈ దాడుల్లో రూ. లక్ష విలువ చేసే 71 రకాల మందులు లభించాయని, వాటిని సీజ్ చేశామన్నారు. శ్రీనివాస్‌పై 18సీ సెక్షన్ ప్రకారం కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ సంవత్సరం జనవరి 1నుంచి ఇప్పటి వరకు జిల్లాలో అనుమతులు లేకుండా మందులు విక్రయిస్తున్న వారిపై కేసులు నమోదు చేశామన్నారు. వీటి విలువ సుమారు రూ.7లక్షల వరకు ఉంటుందన్నారు. కాలం చెల్లిన మందులు, అనుమతులు లేకుండా విక్రయించడం నేరమన్నారు. పశు సంవర్ధక శాఖ, మనుషులకు సంబంధించిన అనుమతి లేని మందులు విక్రయిస్తే చట్టరీత్యా నేరమని, వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. దాడుల్లో బాలకృష్ణ, పావని, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


కొప్పూర్‌లో మందులను సీజ్ చేస్తున్న డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు


ముగిసిన స్పోర్ట్స్ హాస్టల్ ప్రవేశాల ఎంపికలు

వరంగల్ స్పోర్ట్స్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ (సాట్) ఆదేశాల మేరకు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ (డీఎస్ఏ) ఆధ్వర్యంలో హనుమకొండ జేఎన్ఎస్‌లోని రీజినల్ స్పోర్ట్స్ హాస్టల్‌లో ప్రవేశాలకు రెండు రోజులుగా జేఎన్ఎస్‌లో రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన ఎంపిక పోటీలు బుధవారం ముగిశాయి. ఈ ముగింపు వేడుకల్లో డీవైఎస్‌వో గుగులోత్ అశోక్‌కుమార్ పాల్గొని మాట్లాడారు. జేఎన్ఎస్‌లోని రీజినల్ స్పోర్ట్స్ హాస్టల్లో ప్రవేశాల కోసం అండర్ -10, 12, 14, 16 బాలబాలికలకు జిమ్నాస్టిక్స్ హ్యాండ్‌బాల్, రెజ్లింగ్, అథ్లెటిక్స్, స్విమ్మింగ్ క్రీడావిభాగాల్లో నిర్వహించిన ఎంపిక పోటీల్లో రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి 400మంది పాల్గొన్నారు. ఇక్కడ నిర్వహించిన ఎంపిక పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి, ఎక్కువ మార్కులు సాధించిన క్రీడాకారుల పేర్లను సాట్‌కు పంపిస్తామన్నారు. తర్వాత సాట్ ఆదేశాలకు అనుగుణంగా ప్రతిభ కలిగిన క్రీడాకారులను హాస్టల్‌లో ప్రవేశం కోసం ఎంపిక చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సాట్ అబ్జర్వర్లు డాక్టర్ రవికుమార్, నర్సింగరావు, స్వర్ణలత, సంతోష్, హ్యాండ్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్యామల పవన్‌కుమార్, రెజ్లింగ్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి ఎం.డి. కరీం, స్విమ్మింగ్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి మంచాల స్వామిచరణ్, డీఎస్ఏ కోచ్‌లు నరేందర్, శ్రీమన్నారాయణ, దేవిక, అఫ్జల్, వెంకటేశ్వర్లు, జీవన్‌గౌడ్, నవీన్, శంకర్, రమేష్, విష్ణు, తదితరులు పాల్గొన్నారు.


హాస్టల్‌లో ప్రవేశాల కోసం ఏర్పాటు చేసిన ఎంపిక పోటీలను పరిశీలిస్తున్న డీవైఎస్‌వో అశోక్‌కుమార్

'టీ-ఫైబర్'కు చలనం

- మహిళా సంఘాలకే నిర్వహణ బాధ్యతలు
- స్త్రీనిధి ద్వారా రూ.4 లక్షల రుణం
- ఎల్‌వోసీలుగా మహిళల నుంచి దరఖాస్తుల స్వీకరణ
- త్వరలో గ్రామాలకు హైస్పీడ్ ఇంటర్నెట్ సేవలు
- జిల్లాలో 461 గ్రామ పంచాయతీలకు 1,200 కిలోమీటర్ల కేబుల్


అమినాపురంలో ఆరేళ్లుగా నిరుపయోగంగా ఉన్న టీ-ఫైబర్ హబ్

కేసముద్రం, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో ఇంటింటికీ ఇంటర్నెట్, డిజిటల్ సేవలను అందించేందుకు రూపొందించిన 'టీ-ఫైబర్'కు చలనం వచ్చింది. హైస్పీడ్ ఇంటర్నెట్‌ను అందించేందుకు ఏడేళ్ల క్రితం ఈ సంస్థ ద్వారా వైర్లు, పరికరాలు ఏర్పాటుచేసినప్పటికీ గత ప్రభుత్వం పట్టించుకోకుండా జాప్యం చేస్తూ రావడంతో గ్రామాల్లో 'టీ-ఫైబర్' సేవలు ప్రారంభం కాలేదు. జిల్లా వ్యాప్తంగా 2018లో మిషన్ భగీరథ పథకంలో తాగునీటి పైపులతోపాటు భూమిలో పైపులైన్లు(డక్ట్) వేశారు. తర్వాత ఈ డక్ట్‌లోంచి ఆప్టికల్ ఫైబర్ కేబుల్(ఓఎఫ్‌సీ)ను ఏర్పాటు చేసి అన్ని గ్రామాలను ఇంటర్నెట్‌తో కనెక్ట్ చేయాల్సివుంది. టీ-ఫైబర్ సేవలను గ్రామపంచాయతీని కేంద్రంగా చేసుకొని అందిస్తారు. ఇందుకోసం మహబూబాబాద్ జిల్లాలో 461 గ్రామపంచాయతీ కార్యాలయాలకు టీ-ఫైబర్ సేవలందించేందుకు కేబుళ్లను 2018, 2019లో వేశారు. ప్రభుత్వ కార్యాలయాలు, సంస్థలు, విద్యాసంస్థలు, ఆస్పత్రులు, బ్యాంకులకు అధిక వేగంతో కూడిన బ్రాడ్‌బ్యాండ్ సౌకర్యాన్ని కల్పించడం ద్వారా ప్రభుత్వం నుంచి పౌరులకు (జీ2సీ), ప్రభుత్వం నుంచి ప్రభుత్వం(జీ2జీ)లో మెరుగైన సేవలను అందించడమే 'టీ-ఫైబర్' లక్ష్యం. పట్టణ ప్రాంతాల్లో అధికంగా వినియోగించే కేబుల్ ఇంటర్నెట్ సేవలను గ్రామస్థాయికి తీసుకువెళ్లేందుకు ప్రభుత్వం ఈ పథకాన్ని చేపట్టింది. ఈ నేపథ్యంలో కేబుల్ ద్వారా ప్రభుత్వం అందించే టీ-ఫైబర్ ఇంటర్నెట్ సేవల కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారు.

సిగ్నల్ లేక ఈ-సేవల్లో ఇబ్బందులు..

మహబూబాబాద్ జిల్లాలో ఏజెన్సీ ప్రాంతాలైన గంగారం, కొత్తగూడ, గూడూరు, బయ్యారం, ఇతర మండలాల్లోని కొన్ని ప్రాంతాల్లో కొండలు, గుట్టలు అడ్డుగా ఉండడంతో మొబైల్ సిగ్నల్ సరిగా అందడంలేదు. దీంతో గ్రామీణ ప్రాంత ప్రజలతోపాటు రేషన్ డీలర్లు, పోస్టల్ ఉద్యోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామపంచాయతీల్లో 'ఈ-పంచాయతీ'లను ఏర్పాటు చేసినా వాటికి సరైన ఇంటర్నెట్ కనెక్షన్‌లేక అవి మూలకు పడ్డాయి. పల్లెల్లోనే అన్ని రకాల ప్రభుత్వ సేవలను అందేలా టీ-ఫైబర్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. పంచాయతీల్లో పూర్తి స్థాయి ఇంటర్నెట్ సేవలు టీ-ఫైబర్ ద్వారా అందించాల్సివుంది. టీ-ఫైబర్ ద్వారా ఈ-గవర్నెన్స్ ఈ-విద్య, ఓటీటీ, కేబుల్ టీవీ, వర్చువల్ డెస్క్‌టాప్, నివా(ఇల్లు, గ్రామం), టెలిమెడిసిన్, వీడియో కాన్ఫరెన్స్, సామాజిక వైఫై, క్యాంపస్ కవరేజ్ వైఫై తదితర సేవలు అందుబాటులోకి రానున్నాయి. రాజ్‌భవన్, ప్రగతి భవన్, టీ-ఫైబర్ కార్యాలయం, సచివాలయంతో స్టేట్ డేటా సెంటర్ ద్వారా గ్రామాలను అనుసంధానం చేస్తూ ఈ సేవలను కొనసాగించనున్నారు. తాజాగా టీ-ఫైబర్‌ను ఉపయోగిస్తూ డిజిటల్ సేవలన్నింటినీ 'టీ-నెక్స్' పేరుతో 1 గిగా బైట్ పర్ సెకండ్(జీపీపీఎస్) వేగంతో ఇంటర్నెట్‌ను అందిస్తూ అమలు చేయనున్నారు.


కేసముద్రంలో మిషన్ భగీరథ పైపులతోపాటు భూమిలో వేసేందుకు తీసుకువచ్చిన టీ-ఫైబర్ డక్ట్(ఫైల్)

2019లోనే పనులు పూర్తి..

జిల్లాలో మిషన్ భగీరథ పథకం పనులతోపాటే టీ-ఫైబర్‌కు సంబంధించిన గ్రిడ్ పనులను 2018, 2019లోనే పూర్తి చేశారు. తొలుత జిల్లా కేంద్రంలో ఇంటర్నెట్ సేవల కోసం ఇంటింటికీ డక్ట్‌ను సైతం వేశారు. జిల్లాలోని 18 మండలాల్లో 461 గ్రామాల్లో 1,104 వాటర్ ట్యాంకులు, 1,283.52 కిలోమీటర్ల పైపులైన్లు ఉన్నాయి. భూమిలో ఈ పైపులైన్లు వేసే సమయంలో వాటి వెంటే టీ-ఫైబర్ సేవలందించేందుకు ఆప్టికల్ ఫైబర్ కేబుల్(ఓఎఫ్‌సీ) డక్ట్‌ను వేశారు. ఈ కేబుళ్లతో తొలుత గ్రామపంచాయతీ కార్యాలయాలను అనుసంధానించారు. అక్కడ గ్రామంలోని ఇళ్లన్నింటికీ ఇంటర్నెట్ సేవలందించేందుకు హబ్ లాంటి పరికరాలను ఏర్పాటు చేశారు. ఈ హబ్‌కు నిరంతరాయంగా ఇంటర్నెట్ అందించాలనే ఉద్దేశంతో సోలార్ విద్యుత్‌ను అందించేందుకు గ్రామపంచాయతీ కార్యాలయాల్లో సౌర పలకలను, బ్యాటరీలను ఏర్పాటు చేసి కనెక్షన్లు సైతం ఇచ్చారు. జీపీల్లో పరికరాలను ఏర్పాటు చేసి ఐదేళ్లు కావస్తున్నా నేటికి టీ-ఫైబర్ సేవలు జాడలేకుండా పోయాయి. తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక టీ-ఫైబర్ సేవలను స్థానికంగా లోకల్ కేబుల్ ఆపరేటర్(ఎల్‌వోసీ)లకు అప్పగించేందుకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా ఈనెల 10న చివరి తేదీతో స్వయం సహాయక సంఘాల్లోని మహిళల నుంచి ఎల్‌వోసీ కోసం దరఖాస్తులను ఆన్‌లైన్‌లో స్వీకరిస్తున్నారు. ఎంపికైన మహిళలకు ఇంటర్నెట్ పంపిణీకి అవసరమయ్యే పరికరాల కొనుగోలు కోసం స్త్రీనిధి నుంచి రూ.4లక్షల రుణం ఇవ్వనున్నారు. ఎల్‌వోసీ ద్వారా తొలి దశలో ప్రభుత్వ కార్యాలయాలు, ఆ తర్వాత ఇంటింటికీ టీ-ఫైబర్ సేవలను అందించనున్నారు. ఈ నేపథ్యంలో త్వరలో మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో సైతం హైస్పీడ్ ఇంటర్నెట్ అందించే టీ-ఫైబర్ సేవలతో డిజిటల్ విప్లవం రాబోతోంది.

బడికి బదులు పనికి..

- వెట్టిచాకిరిలో బందీ అవుతున్న బాల్యం
- పేదరికంతో పుస్తకం పట్టని చిన్ని చేతులెన్నో..
- ఆపరేషన్ స్మైల్, ముస్కాన్‌తో చదువులమ్మ ఒడికి
- నేడు ప్రపంచ బాల కార్మిక వ్యవస్థ వ్యతిరేక దినోత్సవం


జనగామలో భవన నిర్మాణ పని వద్ద తనిఖీ చేస్తున్న ఆపరేషన్ ముస్కాన్ బృందం (ఫైల్)

జనగామ, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): పేదరికం, నిరక్షరాస్యత చిన్నారుల జీవితాలను అంధకారంలోకి నెడుతున్నాయి. పుస్తకం చేతబట్టి చదువులమ్మ ఒడిలో ఆడుతూ పాడుతూ గడపాల్సిన బాలలు కార్మికులుగా మగ్గిపోతున్నారు. చిన్న వయస్సులోనే బరువులు మోస్తూ కూలీలుగా మారుతున్నారు. తమ ఈడు పిల్లలతో చదుకోవాల్సిన చిన్నారులు జీవనోపాధి కోసం శ్రమించాల్సి వస్తోంది. బడిలో పాఠాలు నేర్చుకోవాల్సిన బాలలు పనిలో కార్మికులుగా మిగిలిపోతున్నారు. చట్టాలు ఎన్ని వచ్చినా బాల కార్మికులు ఎక్కడో ఒక చోట మిగిలిపోతూనే ఉన్నారు. చిన్నారి చేతులకు వెట్టి చాకిరి నుంచి విముక్తిని కల్పించి బడికి బాటలు వేసేలా చేయాల్సిన ఆవశ్యకత ఉంది. నేడు(గురువారం) ప్రపంచ బాల కార్మిక వ్యవస్థ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం..

పేదరికంతో విద్యకు దూరం

పిల్లలు బాల కార్మికులుగా మారడానికి ప్రధానంగా పేదరికం, తల్లి దండ్రులు నిరక్షరాస్యులు కావడం, చదువుకోవడానికి అనుకూలతలు లేకపోవడం, పిల్లల పెంపకం కుటుంబానికి భారం కావడం కారణాలుగా ఉన్నాయి. నేటి ఆధునిక సమాజంలో చాలా కుటుంబాలు పేదరికంలోనే మగ్గుతున్నాయి. ప్రభుత్వాలు ఎన్ని సంక్షేమ పథకాలు పెట్టినా పేదలు, పేదలుగానే మిగిలిపోతున్నారు. గ్రామీణ ప్రాంతాలకు తోడు పట్టణ ప్రాంతాల్లోనే నిరక్షరాస్యత శాతం ఎక్కువగానే ఉంది. 2011 జనాభా లెక్కల ప్రకారం దేశ అక్షరాస్యత రేటు 72.98 ఉండగా తెలంగాణ అక్షరాస్యత 66.54 శాతంగా ఉంది. జనగామ జిల్లా వరకు చూస్తే 61.44 శాతంగా ఉంది. ఈ లెక్కలను బట్టి చూస్తే దాదాపు 35 శాతానికి పైగా నిరక్షరాస్యులు ఉన్నట్లే లెక్క. తల్లిదండ్రులు నిరక్షరాస్యులు కావడం, పేదరికంతో కొట్టుమిట్టాడుతుండడంతో వారికి పిల్లల చదువు కంటే పనిలో పెట్టడమే తక్షణ కర్తవ్యంగా భావిస్తున్నారు.

పనిలో పెట్టుకుంటే కఠిన శిక్షలు

బాల కార్మిక నిషేధం, నియంత్రణ చట్టం (1986, సవరణ చట్టం 2016) ప్రకారం 14 ఏళ్ల లోపు వయస్సు వారు పని చేస్తే బాల కార్మికులుగా వ్యవహరిస్తారు. ఈ వయస్సులోపు ఉన్న వారికి పనిలో పెట్టుకుంటే యజమానులకు కఠిన శిక్ష విధించే అవకాశం ఉంది. బాల కార్మిక చట్టంలో భాగంగా ప్రమాదకరమైన, ప్రమాదకం కాని పనులుగా విభజించారు. 14 ఏళ్ల లోపు బాలలతో ఏ పని చేయించకూడదు. 14 నుంచి 18 ఏళ్ల మధ్య కౌమార బాలలతో ప్రమాదకరమైన పనులు చేయించవద్దని చట్టంలో నిర్దేశించారు. బాల కార్మికులను పనిలో పెట్టుకుంటే యజమానులకు ఆరు నుంచి 2 సంవత్సరాల వరకు జైలు లేదా రూ. 20 వేల నుంచి రూ. 50 వేల వరకు జరిమానా పడొచ్చు లేదా ఈ రెండింటినీ విధించవచ్చు. తిరిగి అదే తప్పు చేస్తే మూడేళ్ల వరకు కచ్చితమైన జైలు శిక్ష పడే అవకాశం ఉంది.

బడి వదిలి పనికి..

ఆడుతూ పాడుతూ చదుకోవాల్సిన పిల్లలు పేదరికం కారణంగా బాల కార్మికులుగా మారుతున్నారు. ఆర్థిక కారణాలతో హోటళ్లు, ఇటుక బట్టీలు, బస్సు, రైల్వే స్టేషన్లు, చాయ్ దుకాణాలు, భవన నిర్మాణ పనుల్లో, మైనింగ్, పరిశ్రమలు, చిన్నపాటి కర్మాగారాల్లో కూలీలుగా మారుతున్నారు. ఇందులో ఎక్కువగా పేద వర్గానికి చెందిన పిల్లలే కాకుండా తప్పిపోయిన పిల్లలు, తల్లిదండ్రులు చనిపోయి అనాథలుగా మారిన పిల్లలు ఎక్కువగా ఉండడం ఆందోళన కల్గించే అంశం. తల్లిదండ్రులు కోల్పోయి, తప్పిపోయిన పిల్లలు, పేదరికంలో మగ్గుతున్న పిల్లలను బాల కార్మికులుగా మారకుండా చూడాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉంది. గురువారం ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ప్రతిఒక్కరూ ప్రతిన బూనాల్సిన అవసరం ఉంది. బాల కార్మిక వ్యవస్థను రూపుమాపడంతో భాగంగా ప్రభుత్వం చేపడుతున్న ఆపరేషన్ స్మైల్, ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమాలు సత్ఫలితాలిస్తున్నాయి. జనగామ జిల్లాలో గడిచిన ఎనిమిదేళ్ల కాలంలో అనగా 2017 నుంచి 2025 వరకు 654 మంది బాల కార్మికులకు విముక్తి కలిగింది. ఇందులో 558 బాలురు ఉండగా 96 మంది బాలికలు ఉన్నారు. ఆపరేషన్ స్మైల్, ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమంలో భాగంగా జిల్లా బాలల పరిరక్షణ విభాగం, కార్మిక, విద్య, పోలీస్ శాఖలు, చైల్డ్ హెల్ప్‌లైన్, మహిళల రక్షణ విభాగాలు సంయుక్తంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి.


గోవిందరావుపేటలో జరిగిన రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

భూ భారతితో ప్రతి రైతుకు న్యాయం

- అధికారులు తప్పు చేస్తే చర్యలు తప్పవు
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

గోవిందరావుపేట, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని రైతుల భూ సమస్యలను పరిష్కరించడానికి ప్రజా ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని ప్రవేశ పెట్టిందని, ఈ చట్టం ద్వారా ప్రతి రైతుకు న్యాయం జరిగేలా చేస్తుందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. బుధవారం గోవిందరావుపేట మండల కేంద్రంలోని రైతు వేదికలో జరిగిన భూ భారతి అవగాహన సదస్సులో రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయసీతక్క, మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాంనాయక్, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్, ములుగు కలెక్టర్ టీఎస్.దివాకర, ఎస్పీ శబరీశ్‌లతో కలిసి పాల్గొన్నారు. ముందుగా ఆయన భూ సమస్యల గురించి రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ గత పాలకులు తెచ్చిన ధరణి చట్టంతో రైతులు అనేక ఇబ్బందులకు గురయ్యారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన ఈ చట్టంలో ప్రతి సమస్యను పరిష్కరించుకునేందుకు వీలు కల్పించిందని చెప్పారు. అర్హులైన వారందరికీ అండగా ఉండేందుకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందన్నారు. ప్రతి రైతుకు న్యాయం చేయడానికి అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని, అధికారులు తప్పు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

మంత్రి సీతక్క మాట్లాడుతూ వ్యవసాయం చేస్తున్న ప్రతి రైతుకు పట్టాలు అందించాలన్న ఉద్దేశంతో సీఎం రేవంత్‌రెడ్డి అనేక అంశాలతో భూ భారతి చట్టాన్ని పొందుపరిచారని, చట్టం అమలుపై రాష్ట్రంలోని నాలుగు మండలాల్లో మొదటి విడతలో పైలెట్ ప్రాజెక్టులుగా తీసుకుని విజయవంతం చేశారని అన్నారు. రెండో విడతలో హైదరాబాద్ మినహా మిగతా 28 జిల్లాల్లోని 28 మండలాలను పైలెట్‌గా ఎంపిక చేశామని చెప్పారు. తొలి విడతలో ములుగు జిల్లా వెంకటాపూర్ మండలాన్ని ఎంపిక చేసి ప్రజల నుంచి 4,100 దరఖాస్తులు స్వీకరించామని, ఇప్పటి వరకు 2వేలకు పైగా సమస్యలను పరిష్కరించినట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలోని రైతులందరికీ భూములపై హక్కులు పొందడానికి ఈ చట్టం ఎంతగానో దోహదపడుతుందని అభిప్రాయపడ్డారు. ఆగస్టు 15 నాటికి రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని ఆమె వెల్లడించారు. భూ భారతి చట్టం ద్వారా తహసీల్దార్, అదనపు కలెక్టర్, కలెక్టర్ స్థాయిలోనే సమస్యలు పరిష్కరిస్తామని, కలెక్టర్ వద్ద సాధ్యం కాకపోతే సీసీఎల్‌ఏలో ఫిర్యాదు చేయవచ్చునని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు సీహెచ్.మహేందర్‌జీ, సంపత్‌రావు, ఆర్డీవో వెంకటేష్, సంబంధిత శాఖల అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

విపత్తులను ఎదుర్కొనేందుకు సిద్ధం

- ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాల ఏర్పాటు
- వరదల సమయంలో తక్షణ స్పందన
- అందుబాటులో అధునాతన పరికరాలు, వాహనాలు



రెస్క్యూ టెండర్ వాహనం


బోటు, ఏరియా లైట్లు


ఎస్‌డీఆర్‌ఎఫ్ వినియోగించే పరికరాలు

మట్టెవాడ(వరంగల్), జూన్ 11 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో వరదలు, విపత్తులను ఎదుర్కొనేందుకు, తక్షణ సహాయ చర్యలు చేపట్టేందుకు ప్రత్యేక ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలు సిద్ధంగా ఉంటాయి. వీటిని అగ్నిమాపక శాఖ ఏర్పాటు చేసింది. ఫైర్ స్టేషన్ల వారిగా సిబ్బందిని ఎంపిక చేసి 10 మంది చొప్పున 24గంటల పాటు అందుబాటులో ఉండే విధంగా ఏర్పాట్లు చేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వివిధ ఫైర్ స్టేషన్లలో పనిచేస్తున్న సిబ్బందికి శిక్షణ ఇస్తున్నారు. మొత్తం 60 మంది సిబ్బంది వర్షాకాలంలో రెస్క్యూ ఆపరేషన్‌లో పాల్గొనేందుకు సిద్ధంగా ఉన్నారు. వరంగల్ జిల్లాలో ఆకస్మిక వరదలు భారీవర్షాల సమయంలో బాధితులను ఆదుకునేందుకు, సహాయ చర్యల కోసం ప్రత్యేక శిక్షణను పొందారు.

వరదల సమయంలో బాధితులను రక్షించి సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ప్రత్యేక వాహనాలను సిద్ధంగా ఉంచారు. అదే విధంగా అనేక రకాల అధునాతన పరికరాలను వినియోగించడంతో ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. భారీ వృక్షాలు పడిపోయినప్పుడు, రోడ్లు కటింగ్ చేసేందుకు ప్రత్యేక కట్లర్లను వినియోగించనున్నారు. వరదల సమయంలో బోట్ల ద్వారా లోతట్టు ప్రాంతాలకు వెళ్లేందుకు బోట్లను సిద్ధంగా ఉంచారు. వరదల సమయంలో ప్రజల ప్రాణాలను రక్షించేందుకు లైఫ్ బాయ్స్ లైఫ్ జాకెట్లు, రోప్‌లు, రెస్క్యూ ట్యూబ్‌లు, ఏరియా లైటింగ్ సిస్టం, జనరేటర్, రోడ్డు కట్టర్, రేయిన్‌కోట్లు, బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు మినీ వ్యాన్లు, ట్రక్కులను వినియోగించనున్నారు.

అధునాతన పరికరాలు సిద్ధం

పడవలు 3, లైఫ్‌బాయ్స్ 100, లైఫ్ జాకెట్లు 50, రోప్స్ -30, ఏరియా లైటింగ్ సిస్టం-2, జనరేటర్లు, పిడర్, కట్టర్లు-2, డీసీఎం వ్యాన్-1, ట్రక్కు-1, మినీవ్యాన్-1తోపాటు స్ట్రెచర్, జనరేటర్లు తదితర పరికరాలు అందుబాటులో ఉంచారు.


RAHUL GANDHI
LEADER OF OPPOSITION
LOK SABHA

9th June, 2025

Dear Dr. Kancha Ilaiah,

I am sorry to hear about the passing of your brother Shri Kancha Kattaiah. Our siblings are often our first friends and confidantes. Their love and support help us navigate life at its hardest. I am sure that your brother's wisdom and affection will continue to guide you.

I can imagine your anguish and sorrow at losing him. Please accept my heartfelt condolences. My thoughts and prayers are with you and your family in this difficult time.

Sincerely,

రాహుల్ గాంధీ పంపిన సంతాప సందేశ పత్రం

ప్రొఫెసర్ కంచ ఐలయ్యకు రాహుల్ గాంధీ సంతాప సందేశం

చెన్నారావుపేట, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పాపయ్యపేట గ్రామానికి చెందిన ప్రొఫెసర్ కంచ ఐలయ్య సోదరుడు కంచ కట్టయ్య ఈ నెల 7న గుండె పోటుతో మృతి చెందగా, లోక్‌సభ ప్రతి పక్ష నాయకుడు రాహుల్ గాంధీ సంతాప సందేశాన్ని బుధవారం పంపించారు. బాధిత కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

రిలయన్స్ గుప్పిట్లోకి పశుగ్రాసం

- టన్నుల కొద్దీ సేకరిస్తున్న ఇండస్ట్రీ
- యంత్రాలతో నేరుగా పొలాల వద్దకే రాక
- తక్కువ ధరకే గంపగుత్తగా కొనుగోళ్లు
- పశువులకు కరువవుతున్న వరిగడ్డి
- పాల పరిశ్రమకు పొంచి ఉన్న ముప్పు


రైతు పొలాల్లో రిలయన్స్ ఇండస్ట్రీ యంత్రాలు కట్టిన వరి గడ్డి కట్టలు

ఎల్కతుర్తి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ ఆధారిత రైతులు ప్రత్యామ్నాయంగా పాడి పశువుల పోషణతో ఆర్థికాభివృద్ధి సాధించే వారు. వ్యవసాయంలో యాంత్రికకరణ వినియోగం పెరగడంతో పశు పోషణ భారమైంది. కేవలం పాల ఉత్పత్తిపై ఆధారపడిన రైతులు తమ వ్యవసాయ పొలాల్లో లభించే వరి గడ్డిని నిల్వ చేసుకుని పశువులకు గ్రాసంగా ఉపయోగించుకుని పశు పోషణ చేస్తున్నారు. మెట్ట ప్రాంతానికి చెందిన పశువుల పెంపకం దారులు ఈ ప్రాంతం నుంచి పశు గ్రాసాన్ని కొనుగోలు చేసేవారు. దీంతో పశువులకు కావలసినంత పశుగ్రాసం ఎల్కతుర్తి మండల పరిధిలోని ఏ గ్రామానికి వెళినా అందుబాటులో ఉండేది. కానీ ఎల్కతుర్తి మండలం సూరారం గ్రామ శివారులో ఇటీవల రిలయన్స్ ఇండస్ట్రీ బయో ఎనర్జి గ్యాస్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసింది. గ్యాస్ తయారీకి వరి గడ్డి అవసరం ఉండడంతో రైతుల వద్ద భారీగా గడ్డిని సేకరించి నిల్వ చేస్తున్నారు. దీంతో పశు పెంపకం దారులకు పశుగ్రాసం కొరత ఏర్పడింది. ఎల్కతుర్తి మండల పరిధిలోని ఎల్కతుర్తి, బావుపేట, తిమ్మాపూర్, కేశవపూర్, గుంటూర్‌పల్లి, దండేపల్లి, వీరనారాయణపూర్, సూరారం, గ్రామాలు పూర్తిగా ఎస్సారెస్పీ ప్రధాన కాలువకు దిగువన ఉన్నాయి. ఈ ప్రాంతంలో ప్రధాన పంటలుగా పూర్తి విస్తీర్ణంలో వరి పంటలను సాగు చేస్తున్నారు. సంవృద్ధిగా పంటలు పండడంతో కావలసినంత పశుగ్రాసం అందుబాటులో ఉంటుంది. మెట్ట ప్రాంతానికి చెందిన రైతులు, పాల డైయిరీలకు చెందిన వ్యాపారులు ఈ ప్రాంతం నుంచి ఎక్కువగా వరి గడ్డిని రైతుల వద్ద కొనుగోలు చేసేవారు. దీంతో పశు పెంపకం దారులకు పశుగ్రాసం కొరత లేకుండా ఉంటుంది.

దక్కని గిట్టుబాటు ధర

రైతులు వరి పంట సాగు చేయగా కోత అనంతరం వచ్చిన గడ్డిని వాములుగా నిల్వ చేసుకుని గిట్టు బాటు ధరలకు విక్రయించుకుని ఆదాయం పొందేవారు. రిలయన్స్ ఇండస్ట్రీ నిర్వాహకులు భారీ యంత్రాలతో నేరుగా రైతు పొలంలో సుమారు రెండు క్వింటాళ్ల బరువు ఉన్న వరి కట్టలు ప్రత్యేక మిషన్‌ల ద్వారా కడుతున్నారు. ఒక్క వరి గడ్డి కట్టకు రైతుకు రూ. 50 మాత్రమే చెల్లించి తీసుకెళ్తున్నారు. ఒక ఎకరంలో సుమారు 10 నుంచి 12 వరి గడ్డి కట్టలు తయారు చేస్తున్నారు. దీంతో రైతుకు సుమారుగా రూ. 500 నుంచి వెయ్యి లోపు వరకు మాత్రమే గిట్టుబాటు అవుతుంది.

టన్నుల కొద్దీ సేకరణ

ఎల్కతుర్తి మండలం సూరారం గ్రామ శివారులో రిలయన్స్ బయో ఎనర్జి గ్యాస్ ఉత్పత్తి ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. గ్యాస్ ఉత్పత్తి కోసం వరి గడ్డి పెద్ద మొత్తంలో అవసరం ఉండడంతో ఎల్కతుర్తి మండల పరిధిలోని గ్రామాల నుంచి పెద్ద ఎత్తున వరి గడ్డిని సేకరిస్తున్నారు. రబీలో పండిన వరి గడ్డిని రిలయన్స్ ఇండస్ట్రీ నిర్వహకులు మొదటి సారిగా వరి గడ్డిని సేకరించించే పనిలో పడ్డారు. గ్రామాల్లో సేకరించిన వరి గడ్డి కట్టలను ఇండస్ట్రీకి తరలించి నిల్వ చేస్తున్నారు. దీంతో పశువులకు పశుగ్రాసం కొరత తీవ్ర స్థాయిలో నెలకొననుంది.

ఉపాధి కోల్పోతున్న ట్రాక్టర్ యాజమానులు

వరి గడ్డి కట్టలు కట్టడానికి గ్రామాల్లో ట్రాక్టర్ యాజమానులు లక్షలు వెచ్చించి గడ్డి కట్టల యంత్రాలను కొనుగోలు చేశారు. రైతులకు అందుబాటులో ఉంటు గడ్డి కట్టలు కట్టి ఆదాయం పొందుతున్నారు. ప్రస్తుతం రిలయన్స్ ఇండస్ట్రీ భారీ యంత్రాలతో గడ్డి కట్టలు కట్టడంతో పాటు వారే స్వయంగా తీసుకెళ్లడంతో ట్రాక్టర్ యాజమానులు ఉపాధి కోల్పోతున్నారు. లక్షలు వెచ్చించి కొనుగోలు చేసిన యంత్రాలు మూలకు పడి ఉపాధి కొల్పోతున్నారు.

పోలీసుల కొరడా..

ఎల్కతుర్తి నుంచి వరి గడ్డి కట్టలను మెట్ట ప్రాంతాలకు, డెయిరీ ఫాంలకు స్థానిక ట్రాక్టర్‌ల ద్వారా తరలిస్తుండగా వాటిని పోలీసులు పట్టుకుని ఇబ్బందులకు గురి చేస్తున్నట్టు ట్రాక్టర్ యాజమానులు ఆరోపిస్తున్నారు.

గతంలో ఏ ప్రాంతానికి గడ్డిని తరలించిన పోలీసులు వాహనాలను అడ్డుకునే వారు కాదని పేర్కొన్నారు. రిలయన్స్ ఇండస్ట్రీ గడ్డి సేకరిస్తున్నప్పటి నుంచి పోలీసులు గడ్డి కట్టలు తరలించకుండా వాహనాలను అడ్డుకుని ఫైన్‌లు వేస్తున్నారని ఆరోపిస్తున్నారు. రిలయన్స్ నిర్వహకులు గడ్డిని ఇతర ప్రాంతాలకు తరలించకుండా ఉండేందుకు పోలీసులచే వాహనాలను అడ్డుకుని ఫైన్‌లు వేయిస్తున్నారని ట్రాక్టర్ యాజమానులు ఆరోపిస్తున్నారు.

రూల్స్ జాన్తానై..

- ప్రజాప్రతినిధులు, అధికారుల అండదండతో ఇసుక అక్రమ రవాణా..?
- వే బ్రిడ్జీల వద్ద చెక్ పోస్టులు కరువు
- ఓవర్ స్పీడ్‌తో ప్రమాదాలు...
- మృత్యువాత పడుతున్న మూగజీవాలు
- ఇసుక లారీలతో తరుచూ ట్రాఫిక్ జామ్

ములుగు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): ఇసుక అక్రమ రవాణాకు అడ్డు, అదుపు లేకుండా పోతుంది. పలు క్వారీల నిర్వాహకులు ప్రజా ప్రతినిధులు, అధికారులతో కుమ్మక్కై ఇష్టారీతిన ఇసుక తోడేస్తున్నారు. నిబంధనలను తుంగలో తొక్కి పర్మిషన్ లేని లారీలలో ఇసుక నింపుతూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. కొందరు వ్యాపారులు ధనార్జనే ధ్యేయంగా జీరో దందా సాగిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. లారీలలో పరిమితికి మించి ఇసుక తరలిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి పెడుతున్నారు. ఇదిలా ఉండగా లారీ డ్రైవర్లు మితిమీరిన వేగంతో నడుపుతూ ప్రజల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారు. ఇసుక లారీల మూలంగా జాతీయ రహదారిపై తరచూ ట్రాఫిక్ జామవుతుంది. దీంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. లారీలు అతి వేగంతో వచ్చి ఢీ కొట్టడంతో ప్రజలు, మూగజీవాలు మృత్యువాత పడుతున్నాయి. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోక పోవడంపట్ల తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

నిబంధనలకు విరుద్ధంగా ఇసుక రవాణా

ఇసుక క్వారీలలో మైనింగ్ పనులు చేట్టాలంటే పలు నిబంధనలు తప్పనిసరిగా పాటించాల్సి ఉంటుంది. అయితే జిల్లాలో కొందరు రేజింగ్ కాంట్రాక్టర్లు వారికేమి పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇసుక తవ్వకాలు ఉదయం 6 గంటల నుంచి రాత్రి 7గంటల వరకు తవ్వకాలు చేపట్టవచ్చని కేంద్ర ప్రభుత్వం మార్గ దర్శకాలు చెబుతున్నాయి. ఇందుకు కాస్త వెసులు బాటు కల్పిస్తూ టీజీఎండీసీ రాత్రి 9 గంటల వరకు తవ్వకాలు నిర్వహించవచ్చని ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. అలాగే 2 మీటర్ల లోతు కన్నా ఎక్కువ తోడకూడదనే నిబంధన కూడా ఉంది. వీటితో పాటు ఓవర్‌లోడ్, పెసా చట్టం అమలు వంటి నిబంధనలు ఉన్నాయి. లారీలలో ఇసుక నింపించడం ద్వార అక్కడున్న ప్రజలకు కాస్త జీవనోపాధి దొరుకుతుంది.

అయితే పలువురు కాంట్రాక్టర్లు అవేవి తమకు పట్టనట్లుగా వ్యవహరిస్తూ జేసీబీలు, ప్రొక్రేనర్లను పెట్టి లారీలలో ఇసుక నింపిస్తూ మా పొట్ట కొడుతున్నారని పలు ఆదివాసి సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. లారీల్లో అదనపు బకెట్ వేస్తూ టన్నుకు అదనంగా డబ్బులు వసూల్ చేస్తున్నారని, దీంతో ప్రభుత్వం ఆదాయానికి గండి పడుతుందని వారు చెబుతున్నారు. గతంలో వే బ్రిడ్జీల వద్ద అధికారులు చెక్ పోస్టులు ఏర్పాటు చేశారని, అయితే ప్రస్తుతం వాటిని తొలగించారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఈ తతంగమంతా కొందరు అధికారుల కనుసన్నలలోనే జరుగుతుందని అంటున్నారు. ఇసుకను నిబంధనలకు మించి లోడ్ చేయడానికి లేదు. అయితే కొన్ని చోట్ల పలువురు కాంట్రాక్టర్లు అదనపు బకెట్ల పేరిట వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పోలీస్, రెవెన్యూ, మైనింగ్ శాఖల అధికారులు రాత్రి సమయంలో క్వారీల వద్ద ఉండక పోవడంతో అదనపు బకెట్ దందాకు తెరలేపి సొమ్ము చేసుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొందరు షెడ్యూల్ తెగలకు చెందాల్సిన హక్కులను వారి అధికారంతో దక్కించుకుంటున్నారని చెబుతున్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో ఇసుక మైనింగ్ గిరిజన సొసైటీల ద్వారా మాత్రమే జరపాలని, అలాంటిది టెండర్లకు పిలిచి కాంట్రాక్టర్లకు అప్పగించడంతో వారు లాభపడుతున్నారని, దీంతో పెసా చట్టం లక్ష్యం నీరుగారి పోతుందని అంటున్నారు.

ఓవర్ స్పీడ్‌తో ప్రమాదాలు

ములుగు జిల్లాలోని తాడ్వాయి, వాజేడు, వెంకటాపురం, మంగపేట మండలాల నుంచి నిత్యం వందలాది లారీలలో హైదరాబాద్, హన్మకొండ, వరంగల్ తదితర ప్రాంతాలకు ఇసుకను తరలిస్తుంటారు. కాగా 12 టైర్స్ లారీలో 26 టన్నులు, 14 టైర్ల లారీలో 32 టన్నుల ఇసుకను మాత్రమే తీసుకెళ్లాల్సి ఉంటుంది. అయితే పరిమితికి మించి ఇసుకను నింపుకుని ఓవర్ స్పీడ్‌తో వెళ్తున్న క్రమంలో తరుచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. దీంతో మూగజీవాలు, ప్రజలు మృత్యువాత పడుతున్నారు.


ఇసుక లారీ ఢీ కొట్టడంతో మృతి చెందిన రవికిరణ్ (ఫైల్ ఫొటో)

ఇటీవలి ప్రమాదాలు..

ములుగు జిల్లా 163వ జాతీయ రహదారి వెంట ప్రయాణిస్తున్న ఇసుకు లారీల వల్ల తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. దీంతో ప్రజలతో పాటు మూగ జీవాలు మృత్యువాత పడుతున్నాయి. అందులో కొన్ని ప్రమాదాల వివరాలు.. జనవరి 2న మంగపేట మండలం కమలాపూరంలో ఇసుక లారీ ఢీ కొనడంతో దోమల నర్సయ్యకు చెందిన రెండు గేదెలు మృతి చెందాయి. ఫిబ్రవరి 6న కమలాపురం ఆర్‌ఎంసీ చర్చి సమీపంలో ఇసుక లారీ ఢీకొట్టడంతో నిమ్మల సత్తమ్మకు చెందిన రెండు సూడి గేదలు మృత్యువాత పడ్డాయి. ఏప్రిల్ 23న ఏటూరునాగారం మండలంలోని జంపన్నవాగు రెండో బ్రిడ్జివద్ద ఇసుక లారీ అతివేగంతో వచ్చి ఢీ కొట్టడంతో వెంకటాపురం మండలం బస్తగూడెం గ్రామానికి చెందిన ద్విచక్ర వాహనదారుడు రవికిరణ్ మృతి చెందాడు. మరో వ్యక్తి రవిశంకర్ తీవ్రంగా గాయపడ్డాడు. మే 2న ఏటూరునాగారం మండలం చిన్నబోయినపల్లి వద్ద వేగంగా దూసుకువస్తున్న ఇసుక లారీని తప్పించబోయిన ఆటో ఆర్టీసీ బస్సును ఢీ కొట్టడంతో ఒక వ్యక్తి కాలు విరిగింది, మరో మహిళకు తీవ్ర గాయాలయ్యాయి.

అదే నెల 18న తాడ్వాయి మండల కేంద్రంలో 163 జాతీయ రహదారి పక్కకు నిలిపి ఉన్న ట్రాక్టార్‌ను వేగంగా వచ్చిన ఇసుకలారీ ఢీ కొట్టడంతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపేరం మండలం సీతారాంపురం గ్రామానికి చెందిన ఉప్ప దుర్గ, చేతుపల్లి సీత మరణించారు. 25 మందికి పైగా గాయపడ్డారు. అదె నెల 30న ఏటూరునాగారం మండలం జీడివాగు వద్ద ఇసుక లారీ ఢీ కొట్టడంతో రెండు పాడి గేదలు అక్కడికక్కడే మృతిచెందాయి. ఈ నెల 1న అదే మండలంలోని చిన్నబోయినపల్లిలో ఇసుక లారీ ఢీ కొట్టడంతో ఒక పాడిగేదె మృత్యువాత పడింది. ఈ నెల 5న అదే మండల కేంద్రంలో ఇసుక లారీ ఢీ కొట్టడంతో గేదె మరణించింది. ట్రాఫిక్ నిబంధనలు పాటించకుండా లారీ డ్రైవర్లు నిర్లక్ష్యంగా వెళ్తుంటే ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. ఇలాంటి ప్రమాదాలతో ప్రజలు విసిగి వేసారుతుంటే.. నిత్యం గంటల తరబడి ట్రాఫిక్ జామై వాహనదారులు, ప్రయాణిలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్టవేసి, లారీలను కట్టడి చేసి ప్రమాదాలను అరికట్టాలని, ట్రాఫిక్ జామ్ సమస్యను పరిష్కరించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



హరిపిరాల రోడ్డులో గుంతలు తవ్వి వదిలేసిన కాంట్రాక్టర్

కాలువలు తీశారు.. పూడ్చకుండా వదిలేశారు

తొర్రూరు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : తొర్రూరు పట్టణానికి నిరంతరం తాగునీరు అందించేందుకు కేంద్ర ప్రభుత్వం సాకారంతో అమృత్-2లో రూ.27కోట్లతో పైప్‌లైన్‌లు, ట్యాంక్‌ల నిర్మాణ పనులు నత్తనడకన కొనసాగుతుండటంతో పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పట్టణంలోని అంగడి ప్రాంతంలో ఒక వాటర్ ట్యాంక్, గోశాల బజార్‌లో మరో వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులు ప్రారంభమైనా అవి బేస్‌మెంట్ స్థాయిలోనే నిలిచిపోయాయి. పూర్తికాక ముందే సంబంధిత కాంట్రాక్టర్ పట్టణంలోని హరిపిరాల రోడ్డు, బస్టాండ్ పక్క గల్లీలో పైప్‌లైన్‌ల కోసం కాలువలు తవ్వి 20 రోజులు గడుస్తున్నా పైప్‌లు వేసి పూడ్చక పోవడంతో ప్రజలు నరకయాతన పడుతున్నారు. పైప్‌లైన్ తవ్వడం వల్ల నల్లాపైప్‌లు పగిలిపోయి నీరు రావడం లేదని, గృహ వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రహదారుల వెంట గ్రామాలకు వెళ్లేవారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత మునిసిపల్ అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. రాత్రి వేళల్లో ప్రమాదాలు జరుగుతాయని, పనుల్లో నిర్లక్ష్యం వహిస్తున్న సంబంధిత కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని, అధికారులు పనులు పూర్తయ్యే విధంగా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

అమ్మాపురంలో 'అమ్మమాట-అంగన్‌వాడీ బాట'

తొర్రూరు రూరల్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అమ్మాపురం, మాటేడు క్లస్టర్ పరిధిలో బుధవారం ప్రభుత్వ ఆదేశాల మరకు 'అమ్మమాట-అంగన్‌వాడీ బాట' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయా గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమాలకు ఏసీడీపీవో ఇందిర, సూపర్‌వైజర్ సునీత హాజరై మాట్లాడారు. చిన్నారులకు, గర్భిణులకు, బాలింతలకు పౌష్టికాహారం అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు నరేష్, శ్రావణి, అంగన్‌వాడీ టీచర్లు రమాదేవి, సంధ్యారాణి, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

ముంచుకొస్తున్న సీజనల్ ముప్పు

- జిల్లా ఆస్పత్రికి పెరుగుతున్న జ్వర బాధితులు

మహబూబాబాద్ క్రైం, జూన్11 (ఆంధ్రజ్యోతి): ముందుగా ఆరంభమైన వర్షాలతో సీజనల్ వ్యాధుల ముప్పు ముంచుకొస్తున్నది. వర్షపు నీరు గుంతల్లో నిలిచి మురికినీరుగా మారడంతో దోమలు వ్యాప్తి చెందడంతో ప్రజలు రోగాల బారి పడుతున్నారు. వర్షాకాలం ఆరంభం కాకముందే గ్రామాల్లో ప్రజలు మంచం పడుతున్నారు. దీంతో ఆస్పత్రులకు వచ్చే రోగుల తాకిడి పెరిగింది. ప్రధానంగా మహబూబాబాద్ జిల్లా ప్రధాన ఆస్పత్రికి జ్వర బాధితుల సంఖ్య రోజురోజుకు పెరుగుతుంది. సాధారణంగా ప్రతీరోజు ఔట్ పేషంట్లు 800 నుంచి వరకు వస్తుంటారు. తాజాగా గత రెండు, మూడు రోజుల నుంచి (ఓపీ) 1200 నుంచి 1500 వరకు పెరిగింది. ఈ క్రమంలో ఆస్పత్రిలో అరకొర వసతులు, రక్తపరీక్షల కిట్లు, మందుల కొరతతో రోగులకు ఇబ్బందులు తప్పడం లేదు. వర్షాల తీవ్రతతో మున్సిపాలిటీలు, గ్రామాల్లో పారిశుధ్యం అస్తవ్యస్థంగా మారింది. సైడ్ డ్రైనేజీ, వర్షపునీటి గుంతలు, దోమలు, ఈగలకు నిలయాలుగా మారాయి. దోమల తీవ్రతతో డెంగీ, మలేరియా, ఫైలేరియా, చిన్నారుల్లో మెదడువాపు లాంటి వ్యాధుల ముప్పు తప్పేటట్లు లేదు. క్షేత్రస్థాయిలో అప్రమత్తం కావాల్సిన జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు నిర్లక్ష్యం వీడలేదనే విమర్శలు వస్తున్నాయి. గ్రామాలు, పట్టణాల్లో సకాలంలో పారిశుధ్యం పనుల నిర్వహణతో పాటు, దోమలు నియంత్రణకు ముందస్తు చర్యలు చేపడితేనే సీజనల్ వ్యాధులను కట్టడి చేయవచ్చు.



మహబూబాబాద్ జిల్లా ప్రధాన ఆస్పత్రి ఓపీలో బారులు తీరిన జ్వర బాధితులు

జిల్లాలో పెరుగుతున్న జ్వర బాధితులు..

జిల్లాలో ఇటీవల కురుస్తున్న వర్షాలకు సీజనల్ వ్యాధుల వ్యాప్తి ఆరంభమైంది. జిల్లా ఆస్పత్రికి జ్వర బాధితుల సంఖ్య క్రమక్రమంగా పెరుగుతూ వస్తుంది. ఓపీ సంఖ్య 1200 నుంచి 1500 మంది వరకు ఉంటుందని వైద్యాధికారులు చెబుతున్నారు. జిల్లా ఆస్పత్రిలోనే కాకుండా ప్రైవేట్ ఆస్పత్రులకు రోగుల తాకిడి పెరిగింది.

పల్లెల్లో అస్తవ్యస్థంగా పారిశుధ్యం..

జిల్లాలో ముందస్తుగా కురుస్తున్న వర్షాలకు గ్రామాలు, మారుమూల తండాల్లో పారిశుధ్యం అస్తవ్యస్థంగా మారింది. సంవత్సర కాలంగా గ్రామ పంచాయతీలకు పాలకమండళ్లు లేక పోవడంతో ప్రత్యేకాధికారుల పాలన సాగుతోంది. ఈక్రమంలో వారు క్షేత్రస్థాయిలో గ్రామాల సందర్శన లేక పారిశుధ్యం అస్తవ్యస్థంగా మారింది. కేవలం పంచాయతీ కార్యదర్శి పర్యవేక్షణలో పనులు కొనసాగుతున్నాయి. గ్రామాలు, తండాల్లోని వీధుల్లో అక్కడక్క సైడ్ డ్రైనేజీ కాల్వలు మురికి నీరు రోడ్డుపైన చేరడం, మరో పక్క కాల్వల్లో చెత్తను తొలగించక పోవడంతో అక్కడ కూడా రోడ్డుపైకి మురికినీరు రావడంతో దోమలకు నిలయంగా మారాయి. దోమల తీవ్రతతో పల్లె జనం రోగాల బారిన పడి మెరుగైనవైద్యం కోసం పట్టణాల బాట పడుతున్నారు. గ్రామాలు, పట్టణాలల్లో దోమల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉన్నది.

కనిపించని దోమల నియంత్రణ చర్యలు..

జిల్లాలో దోమల నియంత్రణ చర్యలు కరువయ్యాయి. ముందస్తుగా ఆరంభమైన వర్షాలతో గడ్డి, పిచ్చి మొక్కలు పెరిగి దోమల తీవ్రత అధికమైంది. వైద్య ఆరోగ్యశాఖ, పంచాయతీ, మున్సిపల్ శాఖల సంయుక్తంగా దోమల నియంత్రణకు చర్యలు చేపట్టాల్సి ఉన్నప్పటికీ క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదు. గ్రామాలు, పట్టణాల్లో దోమల నివారణకు కనీసం ఫాగింగ్ చేయడం లేదని ప్రజలు తమ గోడు వెళ్లబుచ్చుతున్నారు. దోమల తీవ్రతతో ప్రజలు మలేరియా, డెంగీ, ఫైలేరియా లాంటి వ్యాధుల బారిన పడుతూ వైద్య ఖర్చులకు లక్షల్లో ఖర్చు చేస్తూ ఆర్థికంగానష్టపోతున్నారు.

సీజనల్ వ్యాధుల నియంత్రణకు ముందస్తు చర్యలతో పాటు ప్రజల్లో అవగాహన కల్పిస్తేనే కట్టడి సాధ్యం. గ్రామాల్లో ఎప్పటికప్పుడు పారిశుధ్యం పనులు చేపట్టడంతో పాటు దోమలు, ఈగల నివారణకు ప్రతీ మూడు రోజులకు ఒక సారి ఫాగింగ్ చేయించాల్సిన అవసరం ఉంది. మురికి నీరును తొలగించిన గుంతల్లో, అపరిశుభ్ర ప్రదేశాల్లో బ్లీచింగ్ పౌడర్‌ను చల్లించాలి. ప్రతీ రోజు క్రమం తప్పకుండా పారిశుధ్య పనులు చేయించి నియంత్రణకు చర్యలు తీసుకోవాలి.

వైద్యాధికారులు, సిబ్బందిని అప్రమత్తం చేశాం

- రవిరాథోడ్, డీఎంహెచ్‌వో



సీజనల్ వ్యాధులు, కరోనా వైరస్ వ్యాప్తిని దృష్టిలో పెట్టుకొని వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బందిని అప్రమత్తం చేశాం. వ్యాధిగ్రస్తులు ఎప్పుడు వచ్చినా చికిత్స చేసేందుకు సిద్ధంగా ఉన్నాం. ప్రజలు ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ప్రభుత్వ ఆస్పత్రులకు సరిపడ మందులు ఉండేలా ఇండెంట్ పెట్టాం. ఉన్నాయి. పారిశుధ్యం, దోమల నియంత్రణకు ప్రత్యేక ప్రణాళికను సిద్ధం చేస్తున్నాం.

విద్యాసంస్థలను పునఃప్రారంభానికి సిద్ధంగా ఉంచాలి

- తరగతి గదులను శుభ్రంగా ఉంచాలి
- కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్

మహబూబాబాద్ టౌన్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : వేసవి సెలవులు పూర్తయిన సందర్భంగా విద్యాసంస్థలు, అంగన్‌వాడీ కేంద్రాలను పునఃప్రారంభానికి సిద్ధంగా ఉంచాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ సూచించారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రం శివారు ఇందిరానగర్ కాలనీ అంగన్‌వాడీ కేంద్రం, ప్రైమరీ స్కూల్‌ను బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాసంస్థలు పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో గత వారం రోజులుగా (మిషన్‌మూడ్) యుద్ధ ప్రాతిపదికన మండల ప్రత్యేకాధికారులు విద్యాసంస్థలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో పారిశుధ్యం, పరిశుభ్రత, విద్యుత్, ఫ్యాన్లు, మరుగుదొడ్లు, తరగతి గదులు, బ్లాక్ బోర్డులు, యూనిఫాం తదితర సౌకర్యాలను సిద్ధం చేస్తున్నారన్నారు. పండుగ వాతావరణంలో పాఠశాలలను ప్రారంభించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం సూచించిన ప్రకారం.. గ్రామాల్లో బడి బాట నిర్వహిస్తూ తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తూ బడిఈడు పిల్లలను బడిలో చేర్పిస్తున్నారని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. తరగతి గదులను పరిశుభ్రంగా ఉంచాలని, ఆహ్లాదకరమైన వాతావరణంలో పిల్లలకు విద్యాబోధన చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి రవీందర్‌రెడ్డి, జిల్లా సంక్షేమ శాఖ అధికారి ధనమ్మ, సీడీపీవోలు నిలోఫర్, శిరీష పాల్గొన్నారు.



ఇందిరానగర్‌కాలనీ అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శిస్తున్న కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

విచ్చలవిడిగా యూరియా వాడొద్దు : డీఏవో

మరిపెడ, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : రైతులు విచ్చలవిడిగా యూరియాను వాడొద్దని జిల్లా వ్యవసాయ శాఖాధికారి విజయనిర్మల సూచించారు. బుధవారం చిల్లంచర్లలో 'ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. రైతాంగం జీలుగా, జనుము విత్తనాలు విరివిగా వాడితే భూమికి బలం వస్తుందన్నారు. యూరియాను తగ్గించాలన్నారు. పంటలకు వచ్చే చీడపీడల గురించి మండల వ్యవసాయాశాఖాధికారి సలహాలను పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ విజయచంద్ర, శాస్త్రవేత్తలు బి.క్రాంతికుమార్, ఈ.రాంబాబు, ఏవో వీరాసింగ్, ఏఈవో సాయిశృతి, రైతులు అశోక్‌రెడ్డి, సైదులు, జయపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాలు తనిఖీ

- మహబూబాబాద్ అగ్రికల్చర్ : మహబూబాబాద్ పట్టణంలోని ఎస్వీ అగ్రిమాల్, మానుకోట అగ్రిమాల్, మణికంఠ ఫర్టిలైజర్స్ అండ్ సీడ్స్ దుకాణాల్లో పోలీసులు, వ్యవసాయాధికారులు బుధవారం సాయంత్రం తనిఖీ చేపట్టారు. మహబూబాబాద్ టౌన్ సీఐ దేవేందర్, మండల వ్యవసాయాధికారి ఎన్.తిరుపతిరెడ్డి తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా సీఐ దేవేందర్ మాట్లాడుతూ నకిలీ విత్తనాలను విక్రయిస్తే పీడీ యాక్టులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

- మహబూబాబాద్‌రూరల్ : నకిలీ విత్తనాలు విక్రయించిన షాపు యాజమానులపై కఠినచర్యలు తీసుకుంటామని మహబూబాబాద్ రూరల్ సీఐ సర్వయ్య హెచ్చరించారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రం శివారు ఈదులపూసపల్లిలో సాయిలక్ష్మి పెస్టిసైడ్స్ అండ్ సీడ్స్ షాపులో తనిఖీలు చేపట్టారు. ఏవో తిరుపతిరెడ్డి, రూరల్ ఎస్సై దీపిక పాల్గొన్నారు.



జయ్యారం హైస్కూల్ 2003-2004 టెన్త్‌బ్యాచ్ పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

చిన్నగూడూరు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జయ్యారం హైస్కూల్‌కు చెందిన 2003-2004 టెన్త్‌బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని బుధవారం పాఠశాల ఆవరణలో అపూర్వంగా నిర్వహించుకున్నారు. 21 ఏళ్ల కిందట ఒకరికొకరు విడిపోయి ఎక్కడెక్కడో స్థిరపడిన పూర్వ విద్యార్థులందరూ కలుసుకొని వారివారి యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అనాటి జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. మృతి చెందిన ఆనాటి ఉపాధ్యాయులు సంజీవరెడ్డి, రాందాస్‌లకు ఘనంగా నివాళులర్పించి, రెండు నిమిషాలు మౌనం పాటించారు. అలనాటి గురువులను ఘనంగా సత్కరించారు. పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉషశ్రీ, రిటైర్డ్ టీచర్ జగన్నాథరెడ్డి, బ్రహ్మాచారి, సైదులురెడ్డి, రామకృష్ణ, కృష్ణారెడ్డి, వెంకన్న, భద్రయ్య, తేజోన్నతరెడ్డి, ఉపేందర్ పాల్గొన్నారు.

రైతులను మభ్యపెడుతున్న ప్రభుత్వాలు

తొర్రూరు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : రైతుల ఆదాయం రెట్టింపు చేస్తానని ఎన్నికల్లో వాగ్దానం చేసిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులను మభ్యపెడుతున్నాయని అఖిల భారత ఐక్య రైతు సంఘం తొర్రూరు డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు ఊడుగుల రాములు, జక్కుల యాకయ్య అన్నారు. బుధవారం తొర్రూరులోని ఆర్డీవో కార్యాలయంలో రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ధర్నా నిర్వహించి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. రైతులకు మద్దతు ధర ప్రకటిస్తామని తెలిపి మోసం చేశారని, పంట గిట్టుబాటు ధరకు చట్టం తీసుకువస్తామన్న హామీలను కేంద్రం విస్మరించిందన్నారు. కార్పొరేట్ ఎరువుల కంపెనీలు ఇష్టానుసారంగాధరలు పెంచి రైతులను దోచుకుంటుంటే ప్రభుత్వాలు మొద్దు నిద్ర పోతున్నాయన్నారు. సీఎం రేవంత్ రెడ్డి రైతాంగానికి పూర్తిస్థాయిలో రుణమాఫీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజేశ్వర్‌రెడ్డి, యాకయ్య, కేశవులు, భిక్షం, రవీందర్, ఐలయ్య, వెంకన్న ఉన్నారు.

కుసుమ జగదీష్ వర్ధంతి

కొత్తగూడ, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ఉద్యమకారుడు, ములుగు జిల్లా మాజీ జడ్పీ చైర్మన్ కుసుమ జగదీష్ వర్ధంతిని బీఆర్ఎస్ నాయకులు కొత్తగూడలో బుధవారం ఘనంగా నిర్వహించారు. జగదీష్ చిత్రపటానికి పూలు చల్లుతూ నివాళులు అర్పించారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కొమ్మనబోయిన వేణు, అధికార ప్రతినిధి బానోత్ జవహర్‌లాల్ నెహ్రూ నాయక్, శ్రీముసలమ్మ దేవాలయం మాజీచైర్మన్, మాజీ ఉప సర్పంచ్‌లు గుగులోత్ సురేష్ నాయక్, సిరబోయిన శ్రీను, నాయకులు కాసర్ల సాంబయ్య, యాకూబ్, లెంకలపల్లి శ్రీను, దానం నారాయణ, ఆవుల రమేష్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే నిరుపేదలకు పథకాలు

పార్టీ మండలాధ్యక్షుడు వీరభద్రం

కురవి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వంతోనే నిరుపేదలందరికి సంక్షేమ పథకాలు అందుతాయని పార్టీ మండల అధ్యక్షుడు అంబటి వీరభద్రం అన్నారు. కురవి మండలం గాజాతండాలో బుధవారం ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేసి ఇండ్ల పత్రాలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం. ఇండ్లను నిర్మించుకుని బిల్లులు పొందాలన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లలో ఏ ఒక్కరికి ఇండ్లు నిర్మించలేదని విమర్శించారు. కాళేశ్వరం పేరుతో లక్షల కోట్లు దోచుకుని ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో గ్రామపార్టీ అధ్యక్షులు బానోత్ వాసు, బీఎస్ స్వామి, దారావత్ చందులాల్, డీఎస్.శంకర్, బానోత్ సేవాలాల్, రవీందర్, చిరంజీవి, మోతీలాల్ తదితరులు పాల్గొన్నారు.

భద్రకాళి సుందరీకరణకు నిధుల్లేవు..!?

■ ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

- నిధుల కొరతతో అర్థాంతరంగా నిలిచిన చెరువు పూడికతీత పనులు

భద్రకాళి చెరువు సుందరీకరణ పనులకు బ్రేక్ పడింది. చెరువులో పూడికతీత మట్టిని తరలించేందుకు కావాల్సిన రూ.18కోట్ల నిధుల విడుదలకు ప్రభుత్వం ఆమోదం తెలపటం లేదు. టెండర్లు నిర్వహించి, కాంట్రాక్టు అప్పగించినప్పటికీ, ప్రభుత్వం నుంచి శాంక్షన్ ఆర్డర్ రాకపోవటంతో మట్టి తరలింపు నిలిచిపోయింది. 2024 నవంబరు 7వ తేదీన భద్రకాళి చెరువులో నీటిని మత్తడి వద్ద గండి కొట్టి బయటకు విడుదల చేశారు. చెరువులో 1.5 మీటర్ల లోతు నుంచి మట్టి తీయాలని తొలుత నిర్ణయించినప్పటికీ, లోతు పెరిగితే ముంపు ప్రాంతాలు కూడా ఎక్కువగా పెరుగుతాయని భావించిన అధికారులు.. 1.2 మీటర్ల లోతుగా పూడిక మట్టి తీస్తున్నారు. దీంతో 18లక్షల క్యూబిక్ మీటర్ల మట్టిని తీయాలని నిర్ణయించినప్పటికీ, మట్టి తీసే లోతు తగ్గటంతో 13లక్షల క్యూబిక్ మీటర్లకే పూడిక మట్టి తీయాలని నిర్ణయించారు. ఇందులో 10లక్షల క్యూబిక్ మీటర్లు ఇరిగేషన్ శాఖ, 3లక్షల క్యూబిక్‌మీటర్లు కూడా ఆధ్వర్యంలో పూడికమట్టిని తీసేలా ప్రణాళిక రూపొందించారు. ఇక చెరువులో పూడికమట్టి తరలించేందుకు నీటిపారుదలశాఖ అధికారులు చేసిన ప్రయత్నాలు కొలిక్కి రాలేదు.

తొలుత జనవరి 5వ తేదీన క్యూబిక్ మీటర్ మట్టికి రూ.250చొప్పున ధర నిర్ణయించారు. మట్టిని తీసుకెళ్లేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రాలేదని ఆ టెండర్‌ను రద్దు చేశారు. ఆ తరువాత జనవరి 10వ తేదీన మట్టి పూడికతీత, మట్టి తరలింపు పనులకు టెండర్లు పిలిచారు. పూడిక తవ్వటం, లోడింగ్ పనుల కోసం రూ.3.49 కోట్లు, పూడిక మట్టిని తరలించేందుకు క్యూబిక్ మీటర్‌కు 162.56చొప్పున 5.85లక్షల క్యూబిక్ మీటర్ల మట్టిని తరలించేందుకు రూ.9.51కోట్లు చెల్లించేలా మరో టెండర్ పిలిచారు. క్యూబిక్ మీటర్‌కు రూ.162.56 చొప్పున ధర నిర్ణయించి టెండర్ పిలిచినా ఎవరు ముందుకు రాలేదు. దీంతో చివరకు మూడోసారి అధికారులు క్యూబిక్ మీటర్ మట్టికి రూ.71.83గా చెల్లించి, ఇష్టం వచ్చిన వారు మట్టి తీసుకెళ్లవచ్చునని ప్రకటించారు. దీంతో మార్చి 11వ తేదీ నుంచి నీటిపారుదల శాఖ అధికారులు మట్టి విక్రయాలు చేపట్టారు. సుమారు మూడు నెలల కాలంలో 3.40లక్షల క్యూబిక్ మీటర్ల మట్టిని వివిధ వర్గాల వారు తీసుకెళ్లారు. ఇంకా 6.60లక్షల క్యూబిక్ మీటర్ల మట్టిని నీటిపారుదల శాఖ అధికారులు తరలించాల్సి ఉంది. కాగా, 75 ఎకరాల్లో కూడా ఆధ్వర్యంలో చేపట్టిన పూడిక మట్టితీతతో చెరువులోనే ఐదు నక్షత్రాల ఐల్యాండ్‌లను ఏర్పాటు చేశారు. తవ్విన భద్రకాళీ ఆలయం చుట్టూ అంతర్గత రోడ్లు వేశారు. కుడా చేపట్టిన పూడికతీత పనులు దాదాపు పూర్తి కాగా, నీటిపారుదల శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన పనులే సుందరీకరణకు అటంకాలు కలిగిస్తున్నాయనే చర్చ జరుగుతుంది.

వర్షాకాలం ప్రారంభం నాటికే పనులన్నీ పూర్తి చేయాలని మంత్రులు పొంగులేటి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డిలు పదేపదే ఆదేశించినా నిధుల గండం వెంటాడుతోంది. భద్రకాళి చెరువు నుంచి క్యూబిక్ మీటర్‌కు రూ.71.83 చొప్పున చెల్లించి, మట్టి అవసరం ఉన్నవారు 3.40లక్షల క్యూబిక్ మట్టిని తీసుకెళ్లారు. ఇక ప్రజలెవ్వరూ ముందుకు రాకపోవటంతో అధికారులు చెరువు మట్టిని ప్రభుత్వ స్థలాల్లో డంప్ చేసి, అవసరం ఉన్నవారికి విక్రయించాలని నిర్ణయించారు. భద్రకాళి చెరువు నుంచి పూడిక మట్టిని పలివేల్పుల, న్యూశాయంపేట, పద్మాక్షి ఆలయం, అమ్మవారిపేట సమీపంలోని ప్రభుత్వం ఖాళీ స్థలాల్లోకి సుమారు 6.60లక్షల మట్టిని తరలించేలా ఏర్పాట్లు చేశారు. ఈ మట్టిని తరలిస్తే చెరువు పూడికతీత పూర్తవటమే కాకుండా, సుందరీకరణ పనులను కొనసాగించవచ్చునని భావించారు. దీనికి రూ.18.50 కోట్ల నిధులు అవసరంగా అంచనా వేశారు. చెరువు మట్టి విక్రయించగా వచ్చిన రూ.2.44కోట్లు పోగా, మరో రూ.16.11కోట్ల నిధులు కావాలని ప్రభుత్వానికి నీటిపారుదల శాఖ అధికారులు గత నెలలో ప్రతిపాదనలు పంపించారు. స్థానిక ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి సైతం సంబంధిత శాఖ అధికారులు, మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. అయితే ప్రజలకు అవసరం లేని మట్టి మనకెందుకని నీటిపారుదల శాఖ అధికారులు నిధుల విడుదలకు సుముఖత వ్యక్తం చేయటం లేదని సమాచారం. దీంతో మే రెండోవారం నుంచే పూడికతీత పనుల నిలిపివేశారు. ప్రభుత్వం నుంచి రూ.16.11కోట్ల నిధులు వస్తేనే చెరువులో పూడికతీసే అవకాశం ఉంది.

'అధికారులు సిద్ధంగా ఉండాలి'

గూడూరు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : వేసవి సెలవుల అనంతరం విద్యాసంస్థలు, అంగన్‌వాడీ కేంద్రాలను పునఃప్రారంభించేందుకు అధికారులు సిద్ధంగా ఉండాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ అన్నారు. గూడూరు, మట్టేవాడలో ఆశ్రమ, ప్రభుత్వ పాఠశాలలో పాటు అంగన్‌వాడీ కేంద్రాలు, భూభారతి సదస్సులను బుధవారం సందర్శించారు. కార్యక్రమంలో డీఈవో రవీందర్‌రెడ్డి, ఎంఈవో రవికుమార్, సీడీపీవో నిలోఫర్‌అజ్మి, ఎంపీవో సత్యనారాయణ, డీటీ కోమల, హెచ్‌ఎం సదాశివ, ఎస్‌వో సునీత పాల్గొన్నారు.

మద్దతు ధర చెల్లించడంలో విఫలం

గూడూరు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : రైతులు పండించిన పంటలకు మద్దతు ధర కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం చెందాయని అఖిల భారత ఐక్య రైతుసంఘం (ఏఐయూకేఎస్) మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడు పూనెం ప్రభాకర్ విమర్శించారు. గూడూరు తాపీ వర్కర్స్ భవనంలో ఏఐయూకేఎస్ మహబూబాబాద్ డివిజన్ ప్రథమ మహాసభ బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అనంతరం 11 మంది సభ్యులతో సంఘం డివిజన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బొమ్మగాని ఎల్లయ్య, ఉపాధ్యక్షుడిగా తుపాకుల వెంకన్న, ప్రధాన కార్యదర్శిగా ఈక భిక్షం, సహాయ కార్యదర్శిగా చీదరబోయిన పాపయ్య, కోశాధికారిగా పెదకాసు కొమురమల్లు, కార్యవర్గ సభ్యులుగా ఈరెల్లి కొమురయ్య, మూడు రాంచందర్, కంగాల పాపయ్య, బానోత్ మంగ్యా, కురుసం రంగయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పీవోడబ్ల్యూ జిల్లా కార్యదర్శి ముయ్యబోయిన భద్రక్క, అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఆవుల కట్టయ్య, పీవైఎల్‌మండల అధ్యక్షుడు కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలను అరికట్టాలి : ఏఐకేఎంఎస్

గూడూరు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుత వ్యవసాయ సీజన్‌లో మార్కెట్‌లో నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు యథేచ్ఛగా సరఫరా అవుతున్నాయని, వాటిని నివారించాలని అఖిల భారత రైతుకూలీ సంఘం (ఏఐకేఎంఎస్) జిల్లా ప్రధాన కార్యదర్శి బండపల్లి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. గూడూరులోని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ కార్యాలయంలో బుధవారం ఏఐకేఎంఎస్ ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. నాయకులు భాస్కర్ రెడ్డి, సాయిలు, యాకయ్య, రణదీర్, సాంబరాజు, నారాయణ, పడిగె శ్రీను, బానోత్ బిక్కు, వాగ్య, బిట్టు, జనార్ధన్, అశోక్, నరేష్ పాల్గొన్నారు.

ఇదిగిదిగో.. ఎగ్ బిర్యాని..!

అంగన్‌వాడీ కేంద్రాల్లో తొలిరోజు గుడ్డుతో భోజనం

కేసముద్రం, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : కేసముద్రం మండలంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో తొలిరోజు బుధవారం నోరూరించే ఎగ్ బిర్యానిని వడ్డించారు. చిన్నారులకు పౌష్టికాహారాన్ని మరింత రుచిగా అందించేందుకు వారానికి రెండుసార్లు ఎగ్‌బిర్యాని వడ్డించనున్నట్లు రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క ప్రకటించిన విషయం విధితమే. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కేసముద్రం మండలం కల్వల అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు ఇలా ఎగ్ బిర్యాని తయారు చేసి వడ్డించారు.

చెరువులకు గండం

(5వ పేజీ తరువాయి)

పరిస్థితి కనిపించడం లేదు. ఆ చెరువు కింద దాదాపు 800 ఎకరాల్లో 460 మంది రైతులు పంటలు పండిస్తున్నారు. వారి పరిస్థితి ఈ ఖరీఫ్ సీజన్‌లో ఆగమ్యగోచరంగా తయారైంది.

చిన్నగూడూరు మండలం ఉగ్గంపల్లి ఆకేరువాగు కుడి కాలువ నీటి ప్రవాహానికి కొట్టుకుపోయింది. చెక్‌డ్యాం ఆనకట్టకూడా తెగిపోయింది. దానికింద జయ్యారం, చిన్నగూడూరు, ఉగ్గంపల్లి, ఉల్లెపల్లి, మన్నెగూడెం, పురుషోత్తమయగూడెం ప్రాంతాల్లోని 3 వేల ఎకరాలకు పైగా ఆకేరు వాగు కుడి కాలువ చెక్‌డ్యాంపైనే ఆధారపడి పం టలు వేస్తున్నారు. ఈ ఖరీఫ్‌లో వర్షపునీరు నిలిచే పరిస్థితి లేదని రైతులు వాపోతున్నారు. ఈ ఖరీఫ్‌లో పంటల పరిస్థితి ఎలా అని తీవ్ర ఆందోళన చెందుతున్నారు. గుండంరాజుపల్లి పెద్దచెరువు, చిన్నగూడూరు తుమ్మలచెరువు, విస్సంపల్లి పెద్దచెరువులు కూడా తెగిపోయి ఉన్నాయి. అయితే వాటికి మరమ్మతులు కూడ చేపట్టారు. మహబూబాబాద్ మండలం అయోధ్య, వీఎస్.లక్ష్మీపురం చెరువులు తెగిపోయాయి. అయోధ్య చెరువు కట్ట తెగి ఆ నీటి ప్రవాహానికి తాళ్లపూసపల్లి రైల్వేట్రాక్‌పై నుంచి భారీగా నీరు ప్రవహించడంతో ఆ ప్రవాహానికి ట్రాక్ కింద మోరం కొట్టుకుపోయింది.

కేసముద్రం ప్రాంతంలో కూడా రైల్వేట్రాక్ కిందినుంచి మొత్తం కొట్టుకుపోయాయి. వాటిని అప్పటికప్పుడే మరమ్మతులు చేయడంతో రైళ్ల రాకపోకలు కొనసాగాయి. డోర్నకల్ మండలం ముల్కపల్లి వద్ద ఆకేరు నదిపై ఉన్న బ్రిడ్జి కొట్టుకుపోయింది. 365/ఏ జాతీయ రహదారి భారీగా దెబ్బతింది. నర్సింహులపేటలో 16 చెరువులు తెగిపోయాయి. అందులో ఎంకమ్మ, ముంగిమడుగు చెరువులు టెండర్లు కాగా, పనులు ఇంకా ప్రారంభం కాలేదు. ముత్యాలమ్మకుంట ఆకేరువాగుపై మరో రెండు చెక్‌డ్యాంలకు నేటి వరకు మంజూరు కాలేదు. చిన్నచిన్న చెరువులు పూర్తి చేశారు. మరిపెడ సబ్ డివిజన్-3లో 17 చెరువులు తెగగా అందులో ఏడు చెరువుల పనులు పూర్తి చేయగా.. నాలుగు చెరువులు వివిధ దశల్లో ఉండగా మరో ఐదు చెరువులు ప్రతిపాదనల దశలో ఉన్నాయి. సబ్ డివిజన్-4లో ఉల్లెపల్లి కుంట మాత్రమే ఆగిపోయింది. దంతాలపల్లిలో నాలుగు చెరువు తెగిపోగా, వాటికి మరమ్మతులు చేశారు.

ప్రతిపాదనలు పంపాం..

జిల్లాలో గత వర్షాలకు 134 తెగిపోగా 76 చెరువులు గండిపడ్డాయి. 66 చెరువులకు తాత్కాలిక మరమ్మతు, 53 చెరువులకు శాశ్వత మరమ్మతులు చేపట్టినట్లు ఆయా ప్రాంతాల నీటిపారుదల శాఖ డీఈలు చెబుతున్నారు. మరో 13 చెరువుల పనులకు మాత్రం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపడం జరిగిందని నీటిపారుదలశాఖ అధికారులు చెబుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

తొర్రూరు రూరల్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మాటేడు గ్రామ శివారులో బొలెరో వాహనం ఢీకొట్టడంతో ఒకరికి గాయాలైన సంఘటన బుధవారం సాయంత్రం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... తొర్రూరు నుంచి దంతాలపల్లి వైపు బెల్ బ్రాండ్ నిత్యావసర వస్తువులు విక్రయించడానికి వెళ్తున్న బొలెరో వాహనంలో డ్రైవర్ తలకోట రామేశ్వర్, బొల్లు శివప్రసాద్ వెళ్తున్నారు. ఈ క్రమంలో మాటేడు గ్రామ శివారులో మూత్రవిసర్జన చేయడానికి వాహనాన్ని నిలిపి వాహనం స్టార్ట్ చేస్తుండగా వెనుక నుంచి వేగంగా వచ్చిన లారీ ఢీకొట్టింది. దీంతో బొలెరో వాహనంలో ఉన్న డ్రైవర్ రామేశ్వర్‌కు తీవ్రగాయాలయ్యాయి. గాయపడిన రామేశ్వర్‌ను 108 వాహనంలో వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. బొల్లు శివప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు లారీ డ్రైవర్ పుట్ట దుర్గాప్రసాద్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఉపేందర్ రెడ్డి తెలిపారు.

గిరిజన అభ్యర్థుల ఫౌండేషన్ కోర్సుల శిక్షణకు దరఖాస్తుల స్వీకరణ

నెహ్రూసెంటర్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఫౌండేషన్ కోర్సుల శిక్షణకు గిరిజన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ఏటూరునాగారం ఐటీడీఏ పీవో చిత్రమిశ్రా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 17 వరకు జిల్లా గిరిజన సంక్షేమశాఖ కార్యాలయంలో సంబంధిత పత్రాలతో అభ్యర్థులు దరఖాస్తులు అందించాలన్నారు. జయశంకర్‌భూపాలపల్లి, హన్మకొండ, ములుగు, మహబూబాబాద్, జనగామ, వరంగల్ జిల్లాలకు చెందిన డిగ్రీ పాసైన అభ్యర్థులు study circle.cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు సెల్ : 76759 78439, 83285 46015 నెంబర్లను సంప్రదించాలన్నారు.